నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
1
బుధవారం | సెప్టెంబర్ 13 2023 | www.navatelangana.com

నేరాల నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకం



నవతెలంగాణ-మద్దూరు

నేరాల నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకమని మద్దూరు ఏఎస్ఐ జిల్లా జగదీష్ అన్నారు, ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు నేరాల నియంత్రణ షీ టీం పై అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ దుబ్బుడు దీపిక వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు.విద్యార్థులు ఎంత ఎదిగినా గాని తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సాయం చేసిన స్నేహితులను ఎప్పుడు మర్చిపోకూడదని ఆయన తెలిపారు.అలాగే నేరాల నియంత్రణలో విద్యార్థుల పాత్ర ఎంతో అవసరమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆందోళన కొనసాగిస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు 12వ రోజు సిద్దిపేట సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం మోకాళ్లపై కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జాలిగామ బాలకిషన్ మాట్లాడుతూ 27 వేల మందిని సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానం ఉండదని గతంలో చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఇతర స్వీపర్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కరించకపోతే వచ్చే శాసనసభ గజ్వేల్ నియోజకవర్గం ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతామన్నారు. మల్కే సురేందర్ రాజ్యలక్ష్మి సునీత యాదగిరి నరేష్ నాయక్ తదితర పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోసం డీసీఓకు వినతి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్లు మంగళవారం కోపరేటివ్ జిల్లా ఇంచార్జి అధికారి కరుణ కు మెదక్ లో వినతిపత్రం అందజేసినట్లు పలువురు పీఏసీఎస్ డైరెక్టర్లు తెలిపారు. చైర్మన్,వైస్ చైర్మన్ లు ఇప్పటికే ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని,వారు పదవులలో కొనసాగడానికి అనర్హులని అన్నారు. డైరెక్టర్లు వెలుగల శ్రీనివాస్, బొడిగం జ్యోతి, మల్లిగారి వసంత, కొమ్ము రవి, మెరుగు కృష్ణ, ఉడుముల బాల్‌రెడ్డి, కొమ్ముల బాల్ నర్సయ్య, బత్తిని నరసింహులు, మాధవరెడ్డి, దేవరాయ నర్సింహులు ఉన్నారు.

సబ్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ వెల్దుర్తి

మండల పరిధిలో సేరిల గ్రామంలో సబ్ సెంటర్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మాధురి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఏఎన్ఎం స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి బుధవారం నిర్వహించే ఇమ్యునైజేషన్‌కు వచ్చే గర్భవతులు బాలింతలు నెలవారీగా ఇచ్చే ఇంజక్షన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురి మాట్లాడారు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా సబ్ సెంటర్ ను తనిఖీ చేయడం జరిగిందన్నారు. చేరిలా గ్రామ ప్రజలకు సబ్ సెంటర్ ద్వారా ఏ విధంగా సేవలు అందుతున్నాయి ప్రధాన వీధుల్లో శుభ్రతగా పాటిస్తున్నారా వర్షాకాలం సీజన్లో ఎలాంటి భద్రత తీసుకున్నారు అనే విషయాలపై చర్చించడం జరిగిందన్నారు. ఏఎన్ఎం స్రవంతి విధినిర్వాణపై సంతృప్తి వ్యక్తం చేశామన్నారు. సి హెచ్ ఓ ప్రదీప్ కుమార్ ఆశా వర్కర్ మంజుల అంగన్వాడి టీచర్ దేవలత ఉన్నారు.

పోలీసుల ముందుస్తు బదిలీలను రద్దు చేయండి

నవతెలంగాణ-నంగునూరు: తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్, నవంబర్‌లో శాసనసభకు ఎన్నికలు జరుగుతయనే ఉద్దేశంతో అనేక మంది పోలీస్ ఆఫీసర్లను వివిధ జిల్లాలకు ట్రాన్స్ఫర్స్ చేశారు. చాలా మంది విధిలేని పరిస్థితుల్లో భార్యా పిల్లలను విడిచిపెట్టి కొత్త పోస్టులో జాయిన్ అయ్యారు. మరికొంత మంది 10, 20 నెలల సర్వీసు ఉన్నవారు వేరే జిల్లాకు పోయి వివిధ రోగాలతో బాధపడుతూ, ఒంటరి గా ఉంటూ.. డ్యూటీలను సక్రమంగా నిర్వహించకుండా ఎంతో బాధపడుతున్నారు. కాసేపటి క్రితం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చే సంవత్సరం మేలో జెమిలి ఎన్నికలు జరగవచ్చని ఒక ప్రకటన చేశారు. రిటైర్మెంట్కు దగ్గర ఉన్నవారిని వారి సూచన మేరకు వారి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలని, లేదా ఇప్పుడున్న పోస్టింగ్ నుండి వారి స్వంత జిల్లాకు అటాచ్ ఇవ్వాలని పలువురు రిటర్మెంట్‌కు దగ్గర ఉన్నవారు బాధతో సీఎం, డీజీపీని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఒక నెల ముందు పంపించి ఎన్నికల తర్వాత తిరిగి సొంత జిల్లాకు బదిలీలు చేయాలని వేడుకుంటున్నారు.

దేశానికే ఆదర్శం ఆరోగ్య మహిళ పథకం

నవతెలంగాణ-కోహెడ

దేశానికే ఆదర్శంగా ఆరోగ్య మహిళ పథకం ప్రవేశపెట్టబడిందని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య మహిళా పథకాని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా ఆరోగ్యం, సాధికారతకు ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ఎంపీపీ కొక్కుల కీర్తిసురేష్, జెడ్పీటీసీ నాగరాజు శ్యామల మధుసూదన్‌రావు, ఫ్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, డాక్టర్ నిమ్రాతరుణమ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో పర్యటించిన యూనిసెఫ్ బృందం

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలో మంగళవారం ప్రపంచ ప్రతినిధుల (యూనిసెఫ్ బృందం) సభ్యులు స్వచ్ఛబడిని సందర్శించారు. బృందం సభ్యులకు స్వచ్ఛబడిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్, మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ లు స్వాగతం పలికారు. బృందం సభ్యులకు క్లాత్ బ్యాంక్ ల ఏర్పాటు, వాటి వల్ల కలుగు లాభాలను వివరించారు. జర్మనీ,థాయిలాండ్, వర్జీనియా, పర్షియా, లండన్, అర్జెంటీనా, సౌత్ ఆఫ్రికా, కెన్యా, చైనా, బ్రెజిల్, టర్కీ, స్పెన్, బంగ్లాదేశ్, మలేషియా, కొలంబియా, మెక్సికో, జెనివా తదితర దేశాల నుంచి ప్రతినిధులు, జిల్లా అధికారి డిపివో దేవకిదేవి,అడిషనల్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, పట్టణ కౌన్సిలర్ దీప్తి నాగరాజ్, రియాజోద్దీన్, బిఆరెస్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్: ఇంటర్నేషనల్ డిలేగేషన్ తెలంగాణ లో భాగంగా 30 సభ్యుల బృందం కోమటిబండ మిషన్ భగీరథ ప్లాంట్ ని సందర్శించారు. మంగళవారం గజ్వేల్ మండలం కోమటిబండ మిషన్ భగీరథ ప్లాంట్ ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మిషన్ భగీరథ రూపకల్పన, నిర్మాణం, అమలు,నిర్వహణ గురుంచి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఈ విజయ్ ప్రకాష్,ఎస్ ఈ శ్రీనివాస్ చారి,ఈఈ రాజయ్యఉన్నారు.

నవతెలంగాణ -సిద్దిపేటరూరల్: పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సందర్శించిన యూనిసెఫ్ బృందం సభ్యులు చాలా బాగున్నాయని కితాబిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని రాఘవాపూర్, చిన్నగుండవెల్లి గ్రామాల్లోని పాఠశాలను యూనిసెఫ్ బృందం సభ్యులు సందర్శించారు. కార్యక్రమంలో ఎస్పిఎం కన్సల్టెంట్ చెన్నారెడ్డి, బృందం ప్రతినిధులు, డీపీఓ దేవకీదేవి, ఎంపీడీఓ రాఘవేంద్ర రెడ్డి, సర్పంచ్ రమేశ్, కార్యదర్శి యాదగిరి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు. తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరుల అరెస్ట్

నవతెలంగాణ - నార్సింగి





మండల పరిధిలోని సంకాపూర్ వద్ద రైస్‌మిల్ యజమానికి చెందిన వడ్ల లారీలను ఆపి డ్రైవర్‌ను డబ్బులు డిమాండ్ చేసిన ఐదుగురు నకిలీ విలేకర్లను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మంగళవారం జరిగింది. ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం ప్రకారం... తాము విలేకర్లమని సంకాపూర్ వద్ద రైస్‌మిల్ యజమానికి చెందిన వడ్ల లారీలను కుక్కల రాజు, దాసరి నాగరాజు, వడ్ల రాజేందర్, రాజమౌళి, కిరణ్‌లు ఆపి డ్రైవర్‌ను డబ్బులు డిమాండ్ చేశారు. వెంటనే డ్రైవర్ రైస్‌మిల్ యజమానికి ఫోన్ చేసి పిలిపించాడు. లారీలను ఆపిన ఐదుగురిని యజమాని వివరాలు అడిగాడు. వారి మాటలపై అనుమానం వచ్చిన రైస్‌మిల్ యజమాని మండలానికి చెందిన విలేకర్లను పిలిపించారు. ఐదుగురి ఐడీ కార్డులను పరిశీలించారు. నకిలీ విలేకరులని నిర్ధారించుకుని నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు ఐదుగురు నకిలీ విలేకరులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను, 8 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో బిక్నూర్‌లో కేసు నమోదు చేశానని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతాంగ సాయుధ పోరాట యోధులకు..
నిజమైనవారసులు ఎర్రజెండా బిడ్డలే



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి
- అమరవీరులకు జోహార్లు అర్పించేందుకు చేర్యాల నుంచి బైరాన్‌పల్లికి బైక్ ర్యాలీ

నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులకు నిజమైన వారసులు ఎర్రజెండా బిడ్డలేనని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభ సందర్భంగా ఉమ్మడి మద్దూరు మండలంలోని బైరాన్‌పల్లిలో గల బురుజు వద్ద నివాళులర్పించేందుకు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాలలో మల్లారెడ్డి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం నాడు సాగిన పోరాటంలో దొరలు, జమిందార్లు, నైజాం మూకల దౌర్జన్యాలకు ప్రాణాలొడ్డిన బైరాన్‌పల్లి అమరవీరులకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఘనంగా నివాళులర్పిస్తూ, నాటి బైరాన్ పల్లి వీరుల స్ఫూర్తితో నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ఆనాడు సాగిన పోరాటంలో తెలంగాణ ప్రాంతంలో 45 వేల మంది పోరాట యోధులు నేలకొరిగారని, ఈ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందని అన్నారు. నాటి పోరాటంలో అసలే లేని వారు నేడు అధికారంలో ఉండి చరిత్రను వక్రీకరిస్తున్నారని దీనిని ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర పాలకులు నాడు సాధించుకున్న భూములను కాజేయాలని అనేక కుట్రలు పన్నుతున్నారని, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు దక్కాల్సిన భూములను అమ్ముకొని సొమ్ము చేసుకుంటుందని, పేదల భూములను అప్పనంగా కాజేయాలని చూస్తున్నారని తెలిపారు. పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుందని ఎర్రజెండా వెలుగులో దోపిడీ శక్తులను, సహజ వనరులను దోచుకునే కార్పొరేట్ శక్తులను ఐక్యంగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి కళావతి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకటమావో, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు తాటికొండ రవి,సనాది భాస్కర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, బండ కింది అరుణ్ కుమార్, దాసరి ప్రశాంత్, రామ్ సాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, మోకు దేవేందర్ రెడ్డి,మేడిపల్లి చందు, గొర్రె శ్రీనివాస్, ఎండి కరీం, రేపాక కుమార్, రాళ్ల బండి నాగరాజు, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, ఇప్పకాయల శోభ, ఆముదాల రంజిత్ రెడ్డి, పండుగ యాదగిరి, గుండ్ల రవీందర్, కాసెట్టి ఆంజనేయులు, కొంగరి శ్రీధర్, కృపాకర్, ఉల్లంపల్లి సాయిలు, సంజీవ్ కుమార్, సంతోష్, గణేష్ చారి, తాడూరి మల్లేశం పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు

నవతెలంగాణ-మద్దూరు



భూమికోసం భుక్తి కోసం వెట్టి చాపల ముక్తి కోసం నాడు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజల్ని వెట్టిచాకిరీ నుండి బానిసత్వం నుండి విముక్తి చేసిందని, ఆ పోరాటానికి వారసులు కేవలం ఎర్రజెండా బిడ్డలేనని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు కమించరని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల సందర్భంగా బైరాన్‌పెల్లి బురుజు వద్ద అమరవీరుల సంస్మరణ సభ సీపీఐ(ఎం) మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. బురుజు వద్ద అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నైజాం నవాబులు, భూస్వాముల కబంధహస్తాల కింద నలిగిపోయి వెట్టిచాకిరీకి గురవుతున్న బక్క జనాన్ని ఐక్యం చేసి భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా సాగించిన గొప్ప పోరాటమన్నారు. ఈ పోరాటంలో 4,500 మంది రక్తతర్పణ గావించారని, ఒక్క బైరాన్‌పల్లిలోనే 116 మంది అమరులయ్యారన్నారు. నైజాం రజాకార్లు దోపిడీతోపాటు ప్రజల మానప్రాణాలను కూడా హరించి వేసేవారని, మహిళలను బైరాన్‌పల్లి బురుజు వద్ద అమరవీరుల శవాల చుట్టూ బట్టలు విప్పించి బతుకమ్మ ఆడించిన దుర్మార్గుల ఆటలు కట్టించి ప్రాణాలను సైతం ఎదురు పెట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్ర పుటల్లోకి ఎక్కిందన్నారు. ఆనాడు పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వాన్ని కుల మతాలకతీతంగా సాగిన ఈ పోరాటాన్ని నేడు బీజేపీ మతోన్మాద శక్తులు వక్రీకరించి కుల మతాల మధ్య సాగిన పోరాటంగా చిత్రీకరించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. ఇలాంటి వారికి చరిత్రలో ఏమాత్రం స్థానం లేదన్నారు. ఆ పోరాటానికి ఏమాత్రం సంబంధం లేనివారు మేము వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ పోరాటం భూస్వాముల నుండి భూములు గుంజి 10 లక్షల ఎకరాల భూమిని పంచిందని, ప్రజల్ని వెట్టి నుండి విముక్తి చేసిందన్నారు. భూ సంస్కరణ చట్టం తీసుకొచ్చిందన్నారు. రక్షిత కౌలుదారి చట్టాన్ని సాధించిందన్నారు. అనేక విజయాలు సాధించిన ఈ పోరాట స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. నేడు దేశంలో కులాలు మతాల మధ్య వైశ్యామ్యాలు సృష్టించి దేశ లౌకికతత్వానికి ముప్పు వాటిలో విధంగా రాజ్యాంగంలో అనేక సవరణలు చేస్తూ ప్రజలపై భారాలు వేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు ప్రజల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ జెడ్పిటిసి దాసరి కళావతి, రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, చొప్పరి రవికుమార్, బద్దిపడగ కృష్ణారెడ్డి, బండ కింద అరుణ్ కుమార్, సనాది భాస్కర్, దాసరి ప్రశాంత్, సర్పంచ్ తాడూరు రవీందర్, నాయకులు రాళ్ల బండి నాగరాజ్, తాటికొండ రవి, జాలిగపు శిరీష, ఇపకాయల శోభ, రాజు, నవీన్, తాడూరు మల్లేశం, మేడిపల్లి చందు పాల్గొన్నారు.

రెండో రోజు బతుకమ్మ ఆడుతూ అంగన్వాడీల నిరసన

దుబ్బాకలో కొనసాగుతున్న అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ -దుబ్బాక



సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రెండోరోజు మంగళవారం సమ్మె కొనసాగింది. కార్యాలయం ముందు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలియజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు నిరంకుశంగా వ్యవహరించడం సరైంది కాదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకనుకూలంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆయాకు రూ.5 లక్షలు, టీచర్‌కు రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. అంగన్వాడీ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమస్యలు పరిష్కరించకుండా ఐసీడీఎస్‌కు సంబంధంలేని ఇతర డిపార్ట్మెంట్‌లతో అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడం వంటి చర్యలు చేయించడం సరైంది కాదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని, వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో శాంతియుతంగా సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉద్యోగులు పద్మ, నాగరాణి, భూలక్ష్మి, బసవరాణి, రమ, విజయ, ప్రేమలత, బుజ్జమ్మ, మౌనిక, పద్మ, సావిత్రి, సత్తవ్వ, ఐలబాయి పలువురు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య

నవతెలంగాణ - పటాన్ చెరు



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులుముతూ బీజేపీ రాజకీయం చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య ఆరోపించారు. మంగళవారం పటాన్ చెరు పట్టణంలోని ఐలా భవన్‌లో సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో వీరయ్య మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. ఎన్నికల ఓట్ల కోసం మతాల మధ్య చిచ్చుపెట్టడం బీజేపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. జాతీయోద్యమంలో పాల్గొన్న చరిత్ర బిజెపికి, జనసంఘ్‌కు, ఆర్ఎస్ఎస్‌లకు లేదన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు అని అన్నారు. లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన చరిత్ర కమ్యూనిస్టులదని చెప్పారు. సెప్టెంబర్ 17 అనగానే అందరు చరిత్రను వక్రీకరించి తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మవద్దని, నిజాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు, కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య,నాగేశ్వరరావు, శ్రీనివాస్,సత్తిబాబు పార్టీ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలి

నవతెలంగాణ-మెదక్



ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (సీఐటీయూ) యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.మహేందర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్ పేర్కొన్నారు. మంగళవారం సీఐటీయూ రాష్ట్ర పిలుపు మేరకు మెదక్ జిల్లా విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌కి కన్వర్షన్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి ఆర్టిజన్లందరినీ పర్మినెంట్ చేశామని అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆర్టిజన్స్ అందరికీ అర్హతలను బట్టి జేఎల్ఎం జూనియర్ అసిస్టెంట్ సబ్ ఇంజనీర్స్ ఓఎస్ఎల్ గా కన్వర్షన్ ఇవ్వాలని, అన్మడ్ కార్మికులను ఆర్టిజన్స్ గా గుర్తించాలన్నారు. గ్రేడ్ 2 వేతనం చెల్లించాలని, బిల్ కలెక్టర్ మీటర్ రీడర్స్ ఎస్పిఎం లకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని, ఈపీఎఫ్ టు జిపిఎఫ్ ఉద్యోగులకు అమలు చేయాలని, గ్రేడ్ 3, 4 ఆర్టిజన్ కార్మికుల అత్యధిక పిపిని బేసిక్ లో కలిపి పిఆర్సీ అమలు చేయాలని, అర్హులైన వారందరికీ ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, 2011 జేఎల్ఎంలకు ఏరియల్స్ చెల్లించాలని, ట్రాన్స్కో, ఆర్టిజన్స్ కు రిస్కా అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఈనెల 15వ తేదీన జరిగే ఇంద్ర పార్క్ ధర్నాలో యూనియన్లకు అతీతంగా ఆర్టిజన్స్ అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రవీంద్ర ప్రసాద్, ఫసి, శ్రీశైలం, రాజు నాయక్, బాలకృష్ణ, నాగరాజు, అశోక్, దశరథ్, శీను, సలీం, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



ఎస్ఎస్ఆర్-2023లో భాగంగా నూతన ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాదు నుంచి సంయుక్త ఎన్నికల అధికారులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల కొరకు అందిన దరఖాస్తుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం భాగంగా నూతన ఓటరు నమోదు, జాబితాలో సవరణల కొరకు అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 18, 19 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఆర్డీఓలు బన్సీలాల్, బెన్ షాలమ్ తదితరులు పాల్గొన్నారు.

15న తెలంగాణ రైతంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభ

నవ తెలంగాణ కొండపాక : భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరులను స్మరిస్తూ ఆ పోరాట వారసత్వాన్ని ఉనికి పుచ్చుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ఆధ్వర్యంలో 15న జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని కొండపాక మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య కోరారు. వెలికట్ట చౌరస్తా వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పోరాటం తెలంగాణ మరట్వాడ, కర్ణాటక ప్రాంతాలలో 25600 చదరపు మైళ్లకు విస్తరించిందన్నారు. 6536 గ్రామాలలో రెండు కోట్ల ఎకరాల సాగుభూములు పేదలకు దక్కాయి అన్నారు.రక్షిత కౌలుదారి చట్టం చేయబడిందని కౌలుదారులుగా ఉన్న వారికి భూమిపై హక్కులు కల్పించింది అన్నారు. దున్నేవాడిదే భూమి అన్న నినాదాన్ని యావత్ భారతదేశానికి వ్యాపింప చేసిందని గుర్తు చేశారు. కానీ నేడు ఈ పోరాటంతో ఏమాత్రం సం బంధంలేని మతోన్మాద శక్తులు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు తెలంగాణ రైతంగ సాయుధ పోరాటం భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన వర్గ పోరాటం. కులాలకు,మతాలకు అతీతంగా కష్టజీవులు అందరూ ఏకమై సాగించిన పోరాటాన్ని నేడు హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని అన్నారు.ఇలాంటి వారికి బుద్ధి చెప్పే విధంగా ప్రజలు పోరాటం సాగించాలని తెలంగాణ అంటేనే ఎర్రజెండా ఎర్రజెండా అంటేనే పోరాటాలకు ప్రాతిక అని తెలియజేశారు.నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పటిమను ఉనికి పుచ్చుకున్న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆ పోరాటంలో అమరులైన వీరులకు నివాళులు అర్పిస్తూ 2023 సెప్టెంబర్ 15న సిద్దిపేట శివమ్స్ గార్డెన్ లో జరిగే సంస్మరణ సభలో కార్మికులు, కర్షకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మూడోజు కనకాచారి,కొమరవెల్లి కనకయ్య,తాటోజు రవీంద్ర చారి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బర్మ కొమురయ్య పాల్గొన్నారు

రేజింతల్ ఆలయంలో చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ సిద్ది వినాయక ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి డా.చంద్రశేఖర్ మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగం పలికారు. జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ చంద్రశేఖర్ మొదటిసారి రావడంతో ఆలయంలో స్వామి వారికి హారతి చేసి వేదమంత్రాలతో పూజలు చేసి దర్శించుకున్నారు. దీంతో ఆలయ ఆవరణంలో కాంగ్రెస్ నాయకులతో కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించింది. అనంతరం ఆలయంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులుభాస్కర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, విలాస్‌రెడ్డి, ముంగి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అశోక్, బలవంత్ రెడ్డి, రేజింతల్ మల్లిక శ్రీనివాస్‌రెడ్డి, సిరాజుద్దీన్, శశికాంత్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఖేడ్‌కు నూతన డైట్ కాలేజ్ మంజూరు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్‌కు నూతన డైట్ కాలేజ్ మంజూరు అయిందని ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఇప్పటివరకు డైట్ కాలేజ్ లేక సంగారెడ్డి, పటాన్చెరు, సదశిపేట్ లాంటి దూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లేవారన్నారు. కాలేజ్ ఫీజు, రూమ్ కిరాయి, ఇతర ఖర్చులతో అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యల్ని పరిష్కరించడానికి, దశలవారీగా విద్యా వ్యవస్థను అభివృద్ధి పరచడం కోసం తాను కృషి చేస్తున్నట్టు చెప్పారు. తాను గెలిచిన నాటి నుండి నేటి వరకు మైనారిటీ ట్రైబల్ మరియు ఎస్సీ హాస్టల్ వసతులతో కలిగిన పాఠశాలను ఏర్పాటు చేశానన్నారు. నూతనంగా డిగ్రీ కాలేజ్ మరియు పాలిటెక్నిక్ కాలేజ్, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అందరూ విద్యను పొందాలని ప్రతి మండల కేంద్రాల్లో గురుకుల విద్యా మోడల్ స్కూల్ లను ఏర్పాటు చేశానన్నారు. మునుముందు బి.ఎడ్ కాలేజీను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.



కంది పీహెచ్‌సీలో 'ఆరోగ్య మహిళా'

నవతెలంగాణ-కంది

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 'ఆరోగ్య మహిళా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వించారు. స్టేట్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మెన్ చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యమాన్ని ప్రారంభించారు. అనంతరం చింత ప్రభాకర్‌ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయ లక్ష్మీ, ఎంపీడీఓ విశ్వప్రసాద్, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, ఎంపీపీ సరళ పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ విమల వీరేశం,బి అర్ యస్ నాయకులు నందా కిషోర్, కృష్ణ గౌడ్ పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల పోరాటానికి కాంగ్రెస్ అండ

నవతెలంగాణ-జోగిపేట

అంగన్‌వాడీ ఉద్యోగుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అందోలు-జోగిపేట మున్సిపాల్టీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు అన్నారు. జోగిపేటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మంగళవారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అంగన్ వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సోంత భవనాలు లేవని, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తున్నదన్నారు. నిరసన చేపడితే ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని, వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కేసీఆర్ హామీలిస్తున్నారే తప్ప అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీలపై చిన్నచూపు చూస్తున్నదని, పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా హామీలివ్వడం తప్ప అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగులపైన అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వొత్తిడిలు, బెదిరింపులు వస్తున్నా, వాటిని తట్టుకొని సేవలు చేస్తున్నా, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలు తప్పనిసరని, పోరాడితే పోయెదేమి లేదని బానిస సంకేళ్లు తప్పు అని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్, మున్సిపల్ కౌన్సిలర్‌లు రంగ సురేష్, హరికష్ణాగౌడ్, సీనియర్ నాయకులు పి.ప్రవీణ్‌కుమార్, ప్రభా కర్‌రెడ్డి, కష్ణ, శివశంకర్‌గౌడ్, రాజేశ్వర్ గౌడ్, అక్తర్, అలీఅబ్బాస్, బాలయ్య, యూనియన్ నాయకురాలు అరుణ, శేఖమ్మ, పార్వతమ్మ, ఈశ్వరమ్మ, కళావతి, హిమబిందు, సాయమ్మ రమకళతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15న మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-జోగిపేట

ఈనెల 15న స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జోగిపేట ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ అనుబంధసంస్థతో కొన్ని కంపెనీలు 'స్పందన, టెక్ మహీంద్రా, హెచ్డిఎఫ్సి బ్యాంక్, కలిసి మెగా జాబ్ డ్రైవ్‌ను కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అడివి రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోగిపేట చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో(2019 నుండి 2023 విద్యా సంవత్సరంలో) డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచి ంచారు. ఈ జాబ్ డ్రైవ్‌కి వచ్చే యువత వారి పదవ తరగతి, ఇంటర్మీడి యట్, డిగ్రీ, ఆధార్ కార్డు, రెస్యూమ్ 5 కాపీలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తీసుకురావాలన్నారు. ఈ మెగా జాబ్ డ్రైవ్‌లో ఎంపికైతే.. సంస్థకి అనుబంధంగా ఉన్న వివిధ కంపెనీల్లో ఉద్యోగం ఇస్తారన్నారు.. వివరాలకు సంప్రదించవలసిన మొబైల్ నెంబర్స్ 9949055604, 9553141962 ఆయన కోరారు.



ఫలహారం బండి కార్యక్రమంలో నీలం మధు

నవతెలంగాణ-పటాన్‌చెరు

శ్రావణమాసంలో జరిగే బోనాలతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని ప్రజలు విశ్వసిస్తారని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం మల్లికార్జున్ నగర్ కాలనీలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వ హించారు. నిర్వాహకులు నీలం మధు ముదిరాజ్ కి ఘన స్వాగతం పలికారు. ఎన్ఎంఆర్ యువసేన ద్వారా ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని మధు తెలిపారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు కదులుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మన్నే ప్రభు, వంశీ, అల్లూరి ప్రభు, నాయకులు సత్యా నారాయణ రెడ్డి, మహేష్, ప్రశాంత్,నరేష్, సతీష్, నాగరాజు, చింటు, శ్రీను, వంశీ, పాండు, కాలనీ వాసులు, ఎంఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



క్యాన్సర్ రహిత రాష్ట్రంగా అడుగులు

నవతెలంగాణ-గుమ్మడిదల

క్యాన్సర్ రహిత మహిళా సమాజాన్ని నిర్మించనున్నామని ప్రాథమిక కేంద్రం డాక్టర్ ప్రత్యూష అన్నారు. గుమ్మడిదల మండ లంలోని కానుకుంట ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో మంగళవారం మహిళలకు క్యాన్సర్ తదితర సమస్యల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడారు. మహిళల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముందడుగులు వేస్తున్నదన్నారు. 18 ఏండ్లు పైబడిన మహిళలల్లో క్యాన్సర్, వివిధ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత వైద్య ఆరోగ్య కేంద్రాలకు పంపనున్నట్టు తెలిపారు. ఈ సదవకాశాన్ని మారుమూల ప్రాంతాలైన గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ పలువు గోవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు విశాల్ గౌడ్, కుమ్మరి వెంకటేష్, అంగన్వాడి టీచర్ భూలక్ష్మి, సందీప్ గౌడ్, యాదగిరి, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ మానస, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ ప్రతిమ, ఎంపీహెచ్ ఈఓ దుశాంత్ రావు, ఏపీఎం శివకుమార్, సూపర్వైజర్స్ రాజమణి స్వర్ణలత, లక్ష్మి, ఐకెపి మహిళా సంఘాలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధం సరికాదు

- చర్చించి సమస్యలను పరిష్కరించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు
- 2వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- పలు పార్టీలు, యూనియన్ల మద్దతు











నవతెలంగాణ-జహీరాబాద్

సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్బంధం విధించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అంగన్వాడీలు మంగళవారం చేపట్టిన రెండోరోజు సమ్మెలో సాయిలు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని.. వారంతా మహిళలు బడుగు, బలహీనవర్గాలకు చెందినవారే ఉన్నారు. కొన్నేండ్లుగా వారు ఐసీడీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ.. నేటికీ వారికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలేవి రాష్ట్ర ప్రభుత్వం నేటికీ కల్పించలేదన్నారు. దీంతో అంగన్వాడీ ఉద్యోగులు చాలా నష్టపోతున్నారన్నారు. పలు రాష్ట్రాల్లో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు మన రాష్ట్రంలో ఎందుకు గుర్తించడం లేదన్నారు. వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని.. లేని యెడల సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, యూనియన్ నాయకులు మహిపాల్, షాహీదా, సబితా, అనురాధ, శ్యామల, వాసీమా తదితరులున్నారు.

సంగారెడ్డి : అంగన్వాడి ఉద్యోగుల చట్టబద్ధమైన సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని సీఐటీయూ సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి అన్నారు. రెండోరోజు సమ్మెలో పాల్గొని యాదగిరి మాట్లాడారు. అంగన్వాడీ ఉద్యో గుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. సమ్మె చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. జిల్లా అధికారులు అక్రమంగా సెంట ర్‌లోకి వెళ్లి దొంగల్లాగా తాళాలను పగలగొట్టడం అంటే ప్రభుత్వం వైఖరి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లినా.. పట్టించుకోలేదన్నారు. ఎన్నో ఏండ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా.. కనీస వేతన రాకపోవడం శోచనీ యమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి.. వారికి రూ.26 వేల కనీస వేతనమివ్వాల న్నారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, హెల్పర్స్‌కు రూ.5 లక్షల చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షల ఇవ్వాలన్నారు. వారి సమస్యలన్ని ంటినీ వెంటనే పరిష్క రించాలన్నారు. లేని యెడల సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, నాయకులు రజిత, విజయ, సుజాత , సంతోష, భూదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : తహసీల్దార్ కార్యాలయంలో రెండోరోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మెకు సీఐటీయూ నాయకులు నరసింహారెడ్డి, నాగేశ్వరరావు మంగళవారం మద్దతు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలతో వెట్టి చాకిరి చేయించు కుంటున్నాయన్నారు. వారికి చెందాల్సిన కనీస వేతనం తోపాటు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అనేక సందరా ్భలలో సమ్మెలో పోరాటాలు చేసిన ప్రతిసారి హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం వల్లే తిరిగి సమ్మెకు దిగడం జరిగిం దన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సీఐటీయూ నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొండాపూర్ : అంగన్వాడీల సమ్మెకు 2వ రోజైన మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా నాయకులు సాయి తేజ మాట్లాడుతూ.. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం 26,000 చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు వంటి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గత 8 ఏండ్లుగా పోరాటాలు చేస్తున్నా. ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి.. అంగన్వాడీల రిటైర్మెంట్ వయసు 60 ఏండ్లుగా నిర్ణయించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలన్నారు. లేనియెడల అంగన్వాడి ఉద్యోగులతో కలిసి తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కొండాపూర్ మండల కన్వీనర్ బాబురావు,నాయకులు సంజీవులు, అంగన్వాడి యూనియన్ నాయకులు భ్రమరాంబ, ఏసు మని, మధులత, భ్రమరాంబ, అరుణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండోరోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మెలో సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ పాల్గొని మాట్లాడారు. దేశానికే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఆదర్శమంటున్న ముఖ్యమంత్రి.. పక్క రాష్ట్రాల్లో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన విషయం కనపడటం లేదా అని ప్రశ్నించారు. తక్షణమే తెలంగాణలోనూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి ఐసిడిఎస్‌కు సంబంధం లేని పనులను చేయించడాన్ని మానుకోవాలన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె విరమించేది లేదన్నారు. అంగన్వాడీ టీచర్ల నిరవధిక సమ్మెకు వట్‌పలి మండల ఆశా వర్కర్లు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లతో పాటు ఆయాలు ఆయా గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపిన కాటా శ్రీనివాస్ గౌడ్..



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని రెండో రోజైన మంగళవారం పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ బృందం సందర్శించి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ జిన్నారం మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు, సోలక్‌పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి సమ్మె శిబిరంలోనే అంగన్వాడి సమస్యలపై ముచ్చటించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు నాగలక్ష్మి రాధిక, జయమాల, సుజాతల బృందం ఏళ్ల తరబడిగా తాము పనిచేస్తున్న ఉద్యోగ భద్రత లేదని, పెన్షన్ తో పాటుగా ఎలాంటి సౌకర్యాలు లేకపోతే తమ పరిస్థితి ఏమిటంటూ అంగన్వాడీలు గోడు వెళ్ళబోసుకున్నారు. అంగన్వాడీ ఉద్యోగులను పెర్మనెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేలు చెల్లించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి, రిటైర్ మెంట్ బెన్ఫిట్ రూ.10 లక్షలు, హెల్పర్లకు 5 లక్షలు,ప్రమాద భీమా వంటి సదుపాయాలు తప్పని సరిగా కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాయికోటి లక్ష్మణ్, చంద్రయ్య, ఊట్ల ఉపసర్పంచ్ రవి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్, నల్తూరు గ్రామధ్యక్షులు రాజు, జిన్నారం కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు శంకరయ్య, కొన్నింటి మహేష్, భాస్కర్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మద్దతు తెలిపిన టీపీసీసీ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి..

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

అంగన్వాడీ టీచర్లను, ఆయాలను పర్మినెంట్ చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు పట్లోళ్ల సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాన్ని కూడా పెంచాలన్నారు. కొన్నేండ్ల నుంచి టీచర్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు వినోద్ పటేల్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎస్ చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొతారి నర్సింలు, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరి, వీణకుమారి, శాంతాబాయి స్వరూప, అనురాధ, సత్య నిర్మల, లక్ష్మి, పుణ్యవతి, శ్యామల, పద్మ, అనిత, బాలమణి, యాదమ్మ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నరోత్తంకి ఘన సన్మానం



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ వై.నరోత్తంను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సోమవారం రాత్రి జహీరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో అసిస్టెంట్ గవర్నర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తన పదవికి రాజీనామా చేసి గత 20 ఏండ్లుగా వివిధ పార్టీల్లో ప్రజాసేవకు అంకితమైన వై.నరోత్తంను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఇంజనీరింగ్ పట్టా పొందిన నరోత్తం ఇరిగేషన్ శాఖలో వివిధ హొదాల్లో విధులు నిర్వహించి జహీరాబాద్ నియోజకవర్గం తో పాటు ఉమ్మడి జిల్లాలో నీటి వనరుల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను తీసుకున్నారన్నారు. రోటరీ క్లబ్ లో సభ్యునిగా ఉంటూ వివిధ కార్యక్రమాలను చేపట్టడంతో ప్రజాసేవకు అంకితం కావాలని నిర్ణయించుకొని.. ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అనంతరం నరోత్తం మాట్లాడుతూ.. తాను రోటరీ క్లబ్ లో సభ్యుడిగా చేరిన అనంతరం తన సేవలు కొంతమందికే చేరుతున్నాయని.. ఇంకా విస్తృతంగా ప్రజా సేవకు అంకితం కావాలన్న లక్ష్యంతోనే తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తనకు కార్పొరేషన్ చైర్మెన్ పదవి కేటాయించిన సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో రోటరీ క్లబ్. అధ్యక్ష, కార్యదర్శులు సంగ్రామ్ పాటిల్, సి.వెంకటేశం, కోశాధికారి టి.రఘునందన్ రెడ్డి, చెంద్రశేఖర్, డా.శేషురావు, డా. సీతా రామరాజు, వెంకటరెడ్డి, సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే



నవతెలంగాణ జిన్నారం

మండల పరిధిలోని నల్తూరులో అంగరంగ వైభవంగా రేణుక ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ బృందంతో కలిసి నూతన దేవాలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నల్తూరు సర్పంచ్ జనార్ధన్, పార్టీ మండలాధ్యక్షులు రాజేష్ నేతృత్వంలో నల్తూరు గ్రామస్తులు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలతో ఎమ్మెల్యే జీఎంఆర్ బృందానికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పటాన్చెరు నియోజకవర్గంలో సర్వ మతాలకు సమప్రాధాన్యత ఇస్తూ, అన్ని మతాల ప్రార్థనా స్థలాల నిర్మాణాలకు సొంత నిధులు అందిస్తున్నామన్నారు. అంతకు ముందు స్థానికంగా గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీబంధు సెలూన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

నల్తురు గ్రామంలో బీసీబంధు పథకం కింద మంజూరైన నూతన సెలూన్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సెలూన్ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు నరసింగరావు, నాగభూషణం, మాజీ ఎంపీటీసీ బశెట్టిగారి రాజు, నాగరాజు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజేష్, స్థానికులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

- ఈనెల 15న పాలకుర్తి మండలంలోని గూడురులో ప్రోగ్రాం
- ముఖ్య అతిథులుగా హాజరుకానున్న మంత్రి దయాకర్‌రావు, రాష్ట్ర సమాచార కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్

నవతెలంగాణ-పటాన్‌చెరు

తెలంగాణ ప్రాంతంలోని గిరిజన/గ్రామీణ పాఠశాల విద్యార్థులలో శాస్త్ర విజ్ఞానం (సైన్స్) పై అవగాహన ఏర్పరచి, కార్యాచరణ ఆధారిత అభ్యాసం ద్వారా శాస్త్రం పట్ల వారి వైఖరిని మార్చే లక్ష్యంతో వైజ్ఞానిక ప్రదర్శన, క్విజ్ పోటీలను హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించనున్నది. క్రిస్టల్లోగ్రఫీ సొసైటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో, విద్యార్థులకు చేరువయ్యే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామంలో ఈనెల 15వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఎం.ఎస్. సురేంద్రబాబు, డాక్టర్ టీ.బీ. పాత్రుడు తెలియజేశారు. కార్యాచరణ ఆధారిత అభ్యాసం (యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్) ద్వారా సైన్స్ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, వారి వైఖరిలో పరివర్తన తీసుకురావాలనే ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. పాలకుర్తి మండలం, ఆ చుట్టు పక్కల గిరిజన విద్యార్థులకు సమీకరించి, ప్రముఖ పరిశోధకులు, ఆచార్యులతో సైన్స్ ప్రాముఖ్యతను వివరించడం, సైన్స్ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం, క్విజ్ పోటీలు, నమూనాల ప్రదర్శన వంటివి నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. ఆయా పోటీల విజేతలకు నగదు పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను పంపిణీ చేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర సమాచార కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్ పాల్గొంటారని కన్వీనర్లు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను ఉచితంగానే నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ ఎగ్జిబిషన్ లో రసాయన, భౌతిక, గణిత శాస్త్ర నమూనాలను మాత్రమే ప్రదర్శించడానికి అవకాశం కల్పించనున్నట్టు వారు స్పష్టీకరించారు. మరిన్ని వివరాల కోసం కార్యక్రమ సమన్వయ కర్తలు ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల 70136 02236 / డాక్టర్ కటారి 9177712000లను సంప్రదించాలని, లేదా science-expo@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు?
- ఎంపీటీసీలు, సర్పంచుల ఆగ్రహం



నవతెలంగాణ-పుల్కల్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏ ఒక్క అధికారి స్పందించకపోవడంతో.. సమస్యలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని పలు గ్రామాల సర్పం చులు, ఎంపీటీసీలు సంబంధిత అధికారులను సర్వసభ్య సమావే శంలో నిలదీశారు. పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న ఎంపీడీవో కార్యా లయ సమావేశ మందిరంలో మండల అధ్యక్షురాలు చైతన్య విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. గ్రామాల్లో పనులు చేసి ఏండ్లు గడుస్తున్నా.. నేటికీ బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి గ్రామాభివృద్ధి చేసినప్పటికీ.. వాటికి కేటాయించిన బిల్లులను నేటికి రాకపోవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్పుల పాలైన తమను మళ్లీ గ్రామాల అభివృద్ధి చేయాలంటే ఎలా అంటూ సర్పంచ్ శ్రావణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని అధికారులను కోరారు. సంబంధిత అధికారులు స్పందించి.. త్వరలోనే సర్పంచులకు రావాల్సిన పాత బిల్లులను వెంటనే వచ్చే విధంగా తగు చర్యలు చేపడతామని తెలిపారు. పట్టా మార్పు కోసం వచ్చే లబ్దిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని.. లబ్దిదారుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని సర్పంచ్ శ్రావణ్ కుమార్ ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి.. ప్రతీ ఒక్క రైతుకు న్యాయం చేయాలన్నారు. లేని యెడల ప్రజలను ఏకం చేసి రెవెన్యూ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ ఎంపీడీవో జయలక్ష్మి, మండల అధ్యక్షురాలు చైతన్య విజయ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మెన్ గాజుల వీరేందర్, పుల్కల్ తాసిల్దార్ భాస్కర్ కుమార్, పుల్కల్ సర్పంచ్ శ్రావణ్ కుమార్, పుల్కల్ ఎంపిటిసి శ్రీనివాస్ చారి, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండితే ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అమీన్‌పూర్ తహసీల్దార్ గౌరీ వాత్సల్య కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్వైజర్లకు మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఓటర్ నమోదు ప్రక్రియ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన వారు ఫారం 6 ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఉన్నవారు ఓటర్ లిస్టులో మార్పులు, చేర్పులు ఇతర ప్రాంతాల నుంచి అమీన్ పూర్ మండలానికి మార్చుకోవడం కోసం ఫారమ్ 8 ధర దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఓటర్ నమోదు పట్టణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు నిరంతరం బీఎల్‌వోలు, సూపర్వైజర్స్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్ నమోదు ప్రక్రి యను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో పలువురు పంచాయతీ సెక్రెటరీలు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



నవతెలంగాణ-మునిపల్లి

క్రీడలు శారీరదారుఢ్యానికి, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని మునిపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు శైలజ అన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో 14 మరియు 17 సంవత్సరాల లోపు బాల బాలికలకు మంగళవారం వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు శైలజ మాట్లాడుతూ.. క్రీడల వల్ల పోటీతత్వం పెరిగి, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయరంజనీ వెంకటేష్ గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు మీనాక్షి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరి నందన్‌రావు, మండల విద్యాధికారి దశరథ్, స్థానిక ఎస్సై చల్లా రాజశేఖర్, ఉపసర్పంచ్ నాగేష్, నాయకులు సాయికుమార్, విజయ్ కుమార్, ఆయా మండలాలకు చెందిన 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో లేక రైతులకు ఇబ్బందులు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండల డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్ చేగుంట మండల డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. కాగా చేగుంటలో విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌ను మనోహరాబాద్‌కు బదిలీ చేశారు. కాగా ఇప్పటికే చేగుంట డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఏసీబీ అధికారులకు పట్టుబడి సస్పెండ్‌లో ఉన్నారు. దాంతో బదిలీ అయినప్పటికి ఇక్కడ విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. డిప్యుటీ తహసీల్దార్ కుర్చీ ఖాళీగా ఉండడంతో.. ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే మనోహరాబాద్‌కు తహసీల్దార్‌గా గత నెల రోజుల క్రితమే బదిలీపై వచ్చారు. అలాగే ఆర్ఐ కూడా కొద్ది నెలల క్రితమే వచ్చారు. దాంతో వారికి మండలంపై ఇంకా పట్టు లేని పరిస్థితి ఉంది. ఇక్కడ కొన్ని ఏండ్లుగా డిప్యూటీ తహసీల్దార్‌గా భాద్యతలు తీసుకుని విధులు నిర్వహించిన శ్రీకాంత్ మండలంపై పట్టు ఉండి.. వచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించేవారు. కానీ ఆయన బదిలీ కావడంతో తిరిగి ఇక్కడికి ఏసీబీ అధికారులకు పట్టుబడి సస్పెండ్‌లో ఉన్న అధికారికి పోస్టింగ్ ఇవ్వడం.. ఆయన విధులకు రాకపోవడంతో ఆ కుర్చీ ఖాళీగానే ఉండిపోయింది. ఏది ఏమైనా మనోహరాబాద్ మండలానికి విధులు నిర్వహించే డిప్యూటీ తహశీల్దార్‌ను కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

అగ్రహారం గ్రామంలో కార్డన్ సెర్చ్



నవతెలంగాణ/తూప్రాన్‌రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండలంలోని అగ్రహారం గ్రామంలో తూప్రాన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాహనాల పత్రాలను పరిశీలించారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వారు వస్తే.. తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహనతో ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వారు వ్యక్తిగత వివరాలను అడిగితే ఇవ్వవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని రోడ్డుపైకి వెళ్లే ప్రతీ ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఆడ పిల్లల రక్షణ కోసం షీటీం ఉంటుందని ఎవరైనా ఆకతాయిలు వేదింపులకు గురిచేస్తే వెంటనే షీటీం సభ్యులను లేదా వంద నంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాదులోని ప్రగతి భవన్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మంగళవారం కలిశారు. ఈ సంద ర్భంగా నర్సాపూర్ టికెట్ విషయమై కేటీఆర్‌ను ఎమ్మెల్యే ఆరా తీయగా.. అంతా నాన్నకే తెలుసు అని మంత్రి చెప్పినట్టు తెలిసింది.



సీసీ కెమెరాలను పెట్టడమే కాదు.. పనిచేసే విధంగా చూడాలి

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామాల్లో జరిగే నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ఎంత ముఖ్యమో వాటిని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి అన్నారు. తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామంలో దాతల సహకారంతో 22 సీసీ కెమెరాలను సర్పంచ్ శేరి నర్సింహారెడ్డి ఏర్పాటు చేయగా.. ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని.. నేరం జరిగిన తరువాత వాటిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయన్నారు. కెమెరాలను కాపాడుకునే భాద్యత గ్రామ ప్రజలందరిదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మర్డర్‌లలో చనిపోయిన వారి సంఖ్య 2022లో కేవలం 50 మంది ఉంటే రోడ్డు ప్రమాదాలలో చనిపోయిన వారి సంఖ్య 208 వరకు ఉన్నదన్నారు. కాబట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు నిబంధనలను పాటించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై కూడా ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటిపి, ఏటీఎం కార్డు నంబర్ కానీలాంటివి చెప్పవద్దని తెలిపారు. కొందరు జాబ్, లోన్ అంటూ నమ్మబలికి డబ్బును పంపమని అడుగుతారని అలాంటి ఫేక్ మెసేజ్‌లను నమ్మవద్దని అవసరమైతే బ్యాంకు వారిని సంప్రదించాలని సూచించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన యావాపూర్ సర్పంచ్ శేరి నర్సింహారెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పి యాదగిరిరెడ్డి, సీఐ శ్రీదర్, ఎస్ఐ శివానందం, ఎంపీటీసి సంతోష్‌రెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మితో పాటు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలతో పాటు అధిక సంఖ్యలో నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నవతెలంగాణ-మెదక్

తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ 2023లో భాగంగా ఈనెల 16(శనివారం) ఉదయం 9 గంటలకు అండర్ 14,16,18, 20 బాలబాలికలకు మెదక్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ.వెంకటరమణ, ఏ.మధుసూదన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో త్రో, జంప్స్, రన్నింగ్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 30న కరీంనగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు తమ వెంట వయసు ధృవీకరణ పత్రము లేదా ఎస్ఎస్సీ మెమో తీసుకొని రావాలన్నారు. ఇతర వివరాలకు 9963005540 నెంబర్ కు సంప్రదించాలన్నారు..



కరణం కోడలిగా ఆదరించండి

నవతెలంగాణ-పాపన్నపేట

దివంగత కరణం రామచెంద్రరావు కోడలిగా బీజేపీ నుండి రాజకీయ అరంగ్రేటం చేస్తున్నానని.. అందరూ ఆశీర్వదించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం పరిణీత విజ్ఞప్తి చేశారు. మంగళ వారం ఏడుపాయల్లో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నుండి మెదక్ అసెంబ్లీ నియోజక వర్గ టికెట్ ఆశిస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోడీ నాయకత్వం లో దేశం అన్ని రంగాల్లో దూసుకు వెళ్తుంద న్నారు. యువత, మహిళలు, రైతులు, బీజేపీని ఆదరిస్తున్నారని చెప్పారు. కరణం రామ చంద్రా రావు ప్రజా సేవే లక్ష్యంగా, అభివృద్ధి ధ్యేయంగా పని చేశారని, ఆయన ఆశయ సాధన కోసం రాజ కీయాల్లోకి వచ్చానన్నారు. ఆమె వెంట కరణం సోమ శేఖర్ ఉన్నారు.

నిజాంపేట-చల్మెడ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మించాలి



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ నుంచి నిజాంపేట గ్రామా నికి దూరం కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే. కానీ భారీ వర్షాలు పడినప్పుడు కల్వర్టు మీది నుంచి వర్షం నీరు పారడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. దీంతో చల్మెడ గ్రామస్తులు నిజాంపేట మండల కేంద్రానికి రావాలంటే దాదాపు 7 కిలోమీటర్ల దూరం తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంటున్నది. వాగుపై కల్వర్టు ఎత్తు తక్కువ నిర్మించడంతో వరద నీరు కల్వర్టు మీది నుంచి పోతున్నదని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు పడిన పుడల్లా నానా అవస్థలు పడుతున్నామని చల్మెడ, నిజాంపేట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఈ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మిస్తే.. పెద్ద మల్లారెడ్డి, కంచర్ల, ఉప్పర పల్లి, ఇస్సాన్ నగర్, బిబిపేట, గ్రామాలకు వెళ్లడానికి ప్రయాణ సౌకర్యం సులభంగా ఉంటుందన్నారు. ఈ విష యమై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించ ుకోవడం లేదనీ వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిజాంపేట చల్మెడ బ్రిడ్జిని త్వరగా నిర్మించాలని కోరుతున్నారు.

అనుమతిలేకుండా బ్లడ్ యూనిట్స్ బయటకు పంపొద్దు

- బ్లడ్ యూనిట్ సేకరణకు క్యాంపులు నిర్వహించాలి
- డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో తగినంత బ్లడ్ యూనిట్స్ అందుబాటులో ఉంచాలని.. అనుమతి లేకుండా బ్లడ్ యూనిట్స్ బయటకు పంపొద్దని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంక్ నిల్వలను, బ్లడ్ స్టోరేజ్ గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తగినంత బ్లడ్ యూనిట్స్ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన బ్లడ్ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్క బ్లడ్ యూనిట్ అనుమతి లేకుండా బయటకు పంపించరాదని హెచ్చరించారు. బ్లడ్ స్టాకును నోటీస్ బోర్డులో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, రెడ్ క్రాస్ సొసైటీలు సమన్వయంతో బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రతి వారం ఒక ప్రభుత్వశాఖ సమన్వయంతో బ్లడ్ డొనేషన్ క్యాంపు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ కు సూచించారు. ఆరోగ్యశ్రీ నమోదు వివరాలు పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానాల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకొని మంచి వైద్యం అందించాలన్నారు. ఎంసిహెచ్ ఆసుపత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనాస్థియా, రేడియాలజీ నిపుణులు అందుబాటులో వుండాలని, పీజీ ట్రైనీ డాక్టర్లు తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పై ప్రజల్లో మంచి విశ్వాసాన్ని పెంచాలని డాక్టర్లకు సూచించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మహిళా ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కేంద్రంలో వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసు కునేలా మహిళా వైద్యులు అందుబాటులో ఉండాలని, అవస రమైన గైనకాలజిస్టులను నియమించుకోవాలని సూచిం చారు. అత్యవసర సేవలకు ఎక్కడ అంతరాయం కలగకుం డా చూసుకోవాలన్నారు. గర్భిణీలు ఆరోగ్యం పై దృష్టి సారిం చాలన్నారు. హైరిస్క్ డెలివరీ తేదీలు ముందుగా తెలుసు కొని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 108 వాహనాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పిచ్చి మొక్కలను తొలగించి, మంచి మొక్కలు నాటాలని, ఆసు పత్రిలో పెండింగ్ పనులను వెంటనే పూర్తీ చేయాలని వైద్యాధికారులను, టిఎస్ఎంఎస్ఐడిసి ఈఈ రవీందర్ రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందు నాయక్, డిసిహెచ్ఓ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రెండో రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

నవతెలంగాణ-నర్సాపూర్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సమ్మెలో కూర్చున్నారు. వారికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, నాయకులు ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు అశోక్‌గౌడ్, మల్లేశం, అశోక్, కడారి నాగరాజు, సురేష్ నాయక్,రమేష్ యాదవ్, అంగన్వాడి టీచర్లు అన్నపూర్ణ,రాణి ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-చేగుంట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. చేగుంట పట్టణ కేంద్రం మెదక్ రోడ్‌లో గల శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఉత్సవాల్లో ఎంపీ మంగళవారం పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మినీ ఫంక్షన్ హాల్, అభివృద్ధి పనులకు రూ ,10 లక్షల ప్రొసీడింగ్ కాపీని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తదనంతరం ఎంపీని శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేగుంట పట్టణ కేంద్రంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి నీ దర్శించుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందుతున్నారని, మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించడం, ఇంటింటి నుండి బోనాలు తీయడం సంతోషకరమన్నారు. చేగుంట పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు చెప్పారు. అలాగే దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అమ్మవారి ఉత్సవాలకు హాజరై కాంగ్రెస్ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానం చేశారు. చేగుంట పట్టణ వాస్తవ్యుడు ప్రముఖ వ్యాపారవేత్త తీగల బూమ లింగం గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, ఆలయ అభివృ ద్ధికి రూ, రూ.5 లక్షలు విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్ర మంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటిసి శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, రఘురాం పరంజ్యోతి, శ్రీను, నగేష్, సత్తయ్య, ఎర్ర యాదగిరి, సంద్రుగు రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనతోనే తాండాలు పంచాయతీలుగా ఏర్పాటు



నవతెలంగాణ-హవేలిఘనాపూర్

తెలంగాణ రాష్ట్ర సాధనతోనే.. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ గిరిజన తాండాలను గ్రామపంచాయతీ చేశారని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఫరీద్ పూర్‌తాండ, చౌట్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శుక్లాల్ పేట తాండల్లో మంగళవారం జరిగిన గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ తీజ్ పండుగ ఉత్సవాల్లో ఆమె పాల్గొని.. పూజలు చేశారు. ముందుగా గిరిజనుల బోనాలు ఊరేగింపులో ఎమ్మెల్యే గిరినుల వేషాధారంలో బోనం ఎత్తుకొని ఆలయాల వద్దకు వెళ్లారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ పూజలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల నాయకుడు మేకల సాయిలు అనారోగ్యంతో ఉండడంతో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి, హవేలిగన్పూర్ బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు లక్ష్మి సిద్దమ్మ, శ్రీహరి, ఎంపీటీసీ రాజు, నాయకులు సతీష్ రావు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్,రమేష్, సిద్ధిరాంరెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భారాస లో చేరిన కాంగ్రెస్ నాయకులు

ఫరీద్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

గురునాథ్ కుంటకట్ట మరమ్మతులకు రూ.4.80లక్షలు మంజూరు



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండలంలోని బొమ్మరం గ్రామ పంచాయతీ పరిధిలో గల గురునాథ్ కుంటకట్ట మరమ్మతులకు రూ.4.80లక్షలు మంజూరు చేసినట్టు నీటిపారుదల ఎస్ఈ ఏసయ్య తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు గురునాత్ కుంటకట్టకు బుంగలు పడి నీరు వృథాగా పోతున్నదని తెలియడంతో.. వెల్దుర్తి డిప్యూటీ ఈఈ రాజేంద్రరావు, ఏఈ కవితలతో కలిసి కుంటకట్టను ఎస్ఈ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుంటకట్ట మరమ్మతుల కోసం రూ 4.80, లక్షలు మంజూరయ్యాయని.. ఈ మేరకు ఏఏ మరమ్మతులు చేయాలో పరిశీలించామన్నారు. నీటి ఉధృతి తగ్గిన అనంతరం కట్టపై మరమ్మతులు చేపడతామన్నారు. ఆయకట్టదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నీటిని వృథా పోకుండా కాపాడుతామన్నారు. అనంతరం వెల్దుర్తి మండల పరిధిలో చర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కాళేశ్వరం కాలువ గట్టుపై సంపద వనాల్లో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బొమ్మారం సర్పంచ్ శంకర్ యాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు స్టేషన్ శ్రీను పలువురు రైతులు పాల్గొన్నారు.

రేపటి మెదక్ బంద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మెదక్

మెడికల్ కళాశాల మంజూరులో మంత్రి హరీశ్‌రావు అబద్ధపు హామీలకు నిరసనగా ఈనెల 14న నిర్వహించే మెదక్ పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యులు చౌదరి సుప్రబాతరావు, మ్యాడం బాలక్రిష్ణ పిలుపునిచ్చారు.మెదక్ పట్టణంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు పచ్చి అబద్దాలు చెబుతూ.. గడిచిన పదేళ్లుగా మెదక్ జిల్లా అభివృద్ధిని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ నీళ్లు, నిధులు, కార్యాలయాలను సిద్దిపేటకు తరలించుకుపోయిన దొంగ మంత్రి హరీశ్‌రావు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట దొరల అహంకారానికి, మెదక్ ప్రజల ఆత్మగౌరవానికి మధ్య జరిగే సమరమే ఈ నెల 14న నిర్వహించే మెదక్ పట్టణ బంద్ అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, హఫీజ్ మొల్సబ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సల్మాన్, మెదక్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సంతప్ప, వికలాంగుల జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, సంజీవ్, పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, శ్రీశైలం, జాకీర్, నవీన్, బాలరాజ్ గౌడ్, కోట రాజు, మధుసూదన్, రాజు, మధుతారక్, రాజు, అనిల్, మహిపాల్, నవీన్, శ్రీకాంత్ నవీన్, బిక్షపతి, అర్జున్, ప్రభాకర్,గణేష్, అఫ్రోజ్, నవీన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- తుక్కుగుడ సభతో కాంగ్రెస్ ప్రభంజనం షురూ
- సోనియాకు ఘనస్వాగతం పలికెందుకు సిద్ధంగా ఉన్న ప్రజలు
- డీసీసీ అధ్యక్షులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-మెదక్

తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి ఘన స్వాగతం పలికేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తుక్కుగుడ సభతో కాంగ్రెస్ ప్రభంజనం షురూ అయిందని డీసీసీ అధ్యక్షులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో జిల్లాలోని మండలాల అధ్యక్షులతో మంగళ వారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఈనెల 17న తుక్కుగూడలో జరుగనున్న సోనియా గాంధీ భారీ బహిరంగ సభకు బయలుదేరుతున్న యువజన కాంగ్రెస్ శ్రేణుల పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించబోయే సభ చరిత్రలో నిలిచిపోతుందని, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ రుణాన్ని తీర్చుకోవడానికి యావత్ రాష్ట్ర ప్రజానీకం కదులుతున్నారు. ఈ సభతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సోనియా గాంధీ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో, ఐదు గ్యారెంటీ కార్డు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుడు హామీల పై గుర్రుగా ఉన్నారన్నారు. ప్రతి సందర్భంలో ఏదో ఒక అబద్దాలు చెబుతూ ప్రజలను ఏమార్చిన ముఖ్యమంత్రికి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చి తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిళ్ల ఆంజనేయులు, ప్రభాకర్ రెడ్డి, మల్లప్ప, నరసింహ గౌడ్, గోవింద్ నాయక్, గూడూరు ఆంజనేయులు శ్రీనివాస్, శ్యాం సుందర్, పల్లె రాంచందర్ గౌడ్, మహేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, అమీర్, విజయ్, యాదగిరి, నయీం, ప్రేమ్ కుమార్, దయానగర్, మహేందర్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనుల పరిశీలిలన



నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి బుచ్యా నాయక్ మంగళవారం సందర్శించి.. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ఏఈతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మన ఊరు మన-బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో భోజనశాల, మూడు అదనపు గదులు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. అలాగే సర్వ శిక్షా అభియాన్ కార్యక్రమంలో అసంపూర్తిగా ఉండిపోయిన భవనాన్ని కూడా పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. నిర్మాణ నాణ్యతను పరిశీలించగా.. ఇప్పటివరకు కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటిసున్నాడన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, ఏమైనా లోపాలు కనిపిస్తే ప్రధాన ఉపాధ్యాయురాలు తన దృష్టికి తేవాలని, తాను తగిన చర్యలు తీసుకుంటానన్నారు. పనులు దాదాపు పూర్తి కావచ్చాయని ఫ్లోరింగ్‌తో సహా విద్యుత్ ఉపకరణాలు కూడా బిగించడం జరిగిందన్నారు. దురదృష్టవశాత్తూ భవనంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఎవరో దొంగిలించారని వాపోయారు. ప్రభుత్వం పాఠశాలలో చదివే బడుగు బలహీన వర్గాల పిల్లల సౌకర్యార్థం వాటిని ఏర్పాటు చేసిన విషయాన్ని గమనించాలని.. ఇలాంటి సంఘటనలు జరగకుండా గ్రామ ప్రజలు పాఠశాల ముగిసాక ఒక కన్నేసి ఉంచి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయం పై నార్సింగి ఎస్ఐకు ఫిర్యాదు చేస్తానన్నారు. అనంతరం పాఠశాల 10వ తరగతి విద్యార్థులతో పాఠశాల మైదానంలో సరదాగా కాసేపు వాలీబాల్ ఆడి.. విద్యార్థులతో తన బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు.

పోలీస్ స్టేషన్‌లో అంగన్వాడీ టీచర్ల ఫిర్యాదు



నవతెలంగాణ-నిజాంపేట

అంగన్వాడీ సెంటర్ తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారని..అంగన్వాడీ టీచర్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో ఉన్నారని.. అయితే రజాక్‌పల్లి, కాసింపూర్, కల్వకుంట, నగరం, చల్మెడ, సెంటర్ల అంగన్వాడీ సెంటర్ల తాళాలను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. అంగన్వాడి టీచర్ల న్యాయమైన కోరికలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆనాడు కేసీఆర్ నిరాహార దీక్ష చేసి హక్కులను సాధించుకోలేదా? నేడు అంగన్వాడీ టీచర్లు వాళ్ళ హక్కుల కోసం పోరాటం చేస్తే తాళాలు పగలగొడతారా? అని ప్రశ్నించారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మ, రాణి, దుర్గేశ్వరి, రాజమణి, లలిత, సునీత, మంగ తదితరులు పాల్గొన్నారు.

ముున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-మెదక్

మున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్ అన్నారు. మున్సిపల్ వర్కర్స్ సమస్యల పరిష్కరించాలని క్యాంప్ కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి మంగళ వారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు రూ. 21 వేల వేతనం ఇస్తున్నట్టుగా తెలంగాణలో ఇవ్వాలని దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యతనిచ్చి ఇండ్లు స్థలాలు, డబుల్ బెడ్ రూములు ఇండ్లు కేటాయించాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ కార్డులను అందించాలని, ఆదివారాలు, పండుగ సెలవులలో 8 గంటల పనిదినాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 31న 17 డిమాండ్లతో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ మల్లయ్య, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రానికి చెందిన గరుగుల ఎల్లయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంటరెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం మృతుని కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మండల ఉపాధ్యక్షులు దాత్రిక మారుతి, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ నసిరుద్దీన్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్, జీడి భూమా గౌడ్, పంగ కాంతిరాజు, బజారు అంజా గౌడ్, కొమ్మట రామస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని నందిగామ గ్రామంలో గల పలువురి రైతుల పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి సతీష్ మంగళవారం పరిశీలించారు. కాగా వరిలో మొగి పురుగు ఉధృతి అధికంగా ఉన్నదని.. దాని నివారణకి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రా /ఎసిఆర్ఈ లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 60ఎం ఎల్/ఎసిఆర్ఇ మందును పిచికారి చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా యూరియా దఫా దఫాలుగా వాడుకోవాలని మోతాదుకి మించి వాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి కావేరి, రైతులు సంగుస్వామి పాల్గొన్నారు.

అతిమయాత్రలో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ గ్రామంలో బిఆర్ఎస్ యూత్ నాయకుడు సాయి కుమార్(24) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అతని కుటుంబ సభ్యులను పరామర్శిం,చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎఫ్డిసి ఛైర్మెన్ ప్రతాప్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. సాయికుమార్ అంతిమయాత్రలో పాల్గొని పాడే మోశారు. వారి వెంట జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పను గట్ల శ్రీనివాస్ గౌడ్ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి, ఇటిక్యాల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా, గ్రామ అధ్యక్షుడు నాగరాజు,బిఆరెస్ నాయకులు కనకయ్య,ముదిరాజ్ సంఘము నాయకులు పాల్గొనగా యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయి కలుపుగోలుగా ఉండే వ్యక్తి అంటూ యువకులు గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

దుబ్బాకలో గులాబీ జెండా ఎగరడం ఖాయం



నవతెలంగాణ-దుబ్బాక

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ ఎంపీ,బిఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపు ఖాయమని ,దుబ్బాక లో ఎగిరేది గులాబీ జెండాయేనని బిఆర్ఎస్ దుబ్బాక మండల మైనారిటీ అధ్యక్షుడు ఎండి.మక్బూల్ హుస్సేన్ అన్నారు. మంగళవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పల్లెలో గడపగడపన అందుతున్నాయన్నారు.ఇవే బిఆర్ఎస్ ను ముచ్చటగా మూడోసారి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపు ఎప్పుడో ఖాయమైందని, ప్రత్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కవని స్పష్టం చేశారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌యూఈఈయూ జిల్లా గౌరవాధ్యక్షుడు కే గోపాల్‌స్వామి

నవతెలంగాణ-సిద్దిపేట

విద్యుత్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్‌యూఈఈయూ జిల్లా గౌరవాధ్యక్షుడు కే గోపాల్‌స్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఈ కార్యాలయం ముందు రెండు రోజుల రిలే దీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్స్ ల ఆ ర్హతలనుబట్టి జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్స్, సబ్ ఇంజనీర్స్ లుగా కన్వర్షన్ ఇవ్వాలని, అన్ మేన్ కార్మికులను ఆర్టిజన్స్ గా గుర్తించాలని, గుర్తించేలోపు గ్రేడ్ - 2 వేతనం చెల్లించాలని, బిల్ కలెక్టర్స్, మీటర్ రీటర్స్, ఎస్ పి ఎం, ఏపీపీ లకు GO నెం 11 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, ట్రాన్స్కో సి బి డి, ఎస్ ఎం జి కార్మికులకు గతంలో ఇచ్చినట్లు గ్రేడ్ 1 జీతం చెల్లించాలని, తగ్గించే అధికారం యాజమాన్యానికి లేదని అన్నారు. ట్రాన్స్కో, జన్ కో, డిస్కాంల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులను ఆర్టిజన్స్ గా గుర్తించాలని, గుర్తించేలోపు నెం. 21 గజిట్ చేసి రూ. 24,434/-లు చెల్లించాలని, విధి నిర్వహణలో చనిపోయిన అన్మెన్ కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. జే సి ఎల్ వద్ద జరుగు జాయింట్ మీటింగ్ కు యాజమాన్యం తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈపీఎఫ్ టు జిపిఎఫ్ మొత్తం ఉద్యోగులకు అమలు చేయాలని, మిగిలిపోయిన 136 మందిని ఆర్టిజన్స్ గా గుర్తించాలని, ఐ డి నెంబర్లు ఇచ్చిన ట్రాన్స్ కో సెక్యూరిటీ గార్డుల నందరినీ ఆర్టిజన్స్ గా గుర్తించాలని కోరారు. కార్మికులందరూ ఐక్యంగా ఉంటేనే న్యాయమైన



సమస్యల పరిష్కారం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ ఎస్ పి డి సి ఎల్ కంపెనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు అశోక్ , కోశాధికారి నాగేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కరుణాకర్, డప్పు పరశురాములు, రవికుమార్, సహాయం కార్యదర్శులు భాస్కర్ , నాయకులు శ్రీనివాస్ రెడ్డి, విష్ణు, స్వామి, సుధాకర్, కనకరాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై అధికారుల వేధింపులు ఆపాలి

- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని గజ్వేల్ అంగన్వాడి ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల పై సిడిపిఓ ఇతర ప్రభుత్వ అధికారులు అప్రకటిత ఎమర్జెన్సీని ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ అంగన్వాడి సెంటర్ లపై ఏం ఆయాలను టీచర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ ఐసిడిఎస్ ఎంపీడీవో రెవెన్యూ అధికారులు ఫోటోలు తీస్తూ వేధింపులకు గురి చేయడం జరుగుతుందని వెంటనే మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్లు ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం వేతనాల పెంపుదల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పర్మినెంట్ సౌకర్యాల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తుంటే అందులో భాగంగా గజ్వేల్ నియోజకవర్గం లోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లాలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సమ్మె నోటీసులు అందజేయడం జరిగింది కానీ గజ్వేల్ ఐసిడిఎస్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అంగన్వాడి టీచర్ల కనీస ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ రాజ్యాంగం కల్పించడం



సమ్మె చేసే హక్కును నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యం లేకుండా నియంత్రిత చర్యలకు పాల్పడటం జరుగుతుందని విమర్శించారు. గత ఆరు ఏడు సంవత్సరాలుగా అంగన్వాడీ టీచర్లకు ఇవ్వవలసిన టి ఏ లు డిఏలు అమలు చేయడం లేదని కర్ణాటక కేరళ తమిళనాడు తరహాలో పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాడ్యుటి రెగ్యులర్ చేయకపోవడం తెలంగాణ లో జరుగుతుందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తుంటే స్థానికంగా ఉన్న సిడిపిఓ అధికారులు ప్రభుత్వానికి వంత పాడుతూ నియంతృత చర్యలకు పాల్పడటం జరుగుతుందని అన్నారు .అంగన్వాడి టీచర్లు ఆయనపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు నియంతృత్వ అధికారులపై తగిన ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

రేపు మత్స్యకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-గజ్వేల్

ఈ నెల 13వ తేదీన రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటన సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా మత్స్య శాఖ, మునిసిపల్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలోని మహతి ఆడిటోరియంలో ఏర్పాట్లలో వి-విఐపి సిట్టింగ్, ప్రజాప్రతినిధులు, మీడియా గాలరి, సామాన్య ప్రజలకు సౌకర్యవంతంగా కూర్చునేందుకు ఏర్పాట్లు చెయ్యాలని ఎజెన్సీ కి తెలిపారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. అనంతరం జిల్లాలోని కేవలం గజ్వేల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో మత్స్య కార సహకార సంఘాల సభ్యులందరికి గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. మత్స్య కార సహకార సంఘాల సభ్యులకు సులభంగా తెలిసే విధంగా ప్రతి గ్రామం వారిగా శిబిరాలను ఏర్పాటు చెయ్యాలని ఎజెన్సీ కి తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ ఎంపిడిఒ, ఎంపిఓలు మీ మండలాల్లో ని గ్రామల సెక్రటరీలతో కలిసి మత్స్య కార సహకార సంఘాల



సభ్యులు గుర్తింపు కార్డుల పంపిణీకి గ్రామాల వారిగా ప్రక్కనే ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలలో ప్రతి సొసైటీ సభ్యునికి కార్డును పంపిణీ చెయ్యాలి. కార్డు పంపిణీలో ఎలాంటి ఇబ్బంది జరగకుండా నేరుగా సభ్యునికె కార్డు అందజేసి సంతకం తీసుకోవాలని తెలిపారు. తదనంతరం అందరికీ భోజన ఏర్పాట్లు సైతం సభ పూర్తి అయ్యేలోపూ చెయ్యాలి. సొసైటీ సభ్యులు కార్డు తీసుకుని భోజనం చెసి వెళ్ళేలా ఏర్పాట్లు ఉండాలని ఎజెన్సీ కి తెలిపారు. భోజనాలు చేసె ప్రాంతంలో మార్కెట్ పారిశుద్ధ్య, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల అక్కడే ఉంటి ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని తెలిపారు. వాహనాల పార్కింగ్, బందోబస్తు సంబంధిత ఏర్పాట్లు చూడాలని పోలిస్ అధికారులకు తెలిపారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్డిసి చైర్మన్ ప్రతాపరెడ్డి, ఎఎంసి చైర్మన్ మాదాసుశ్రీనివాస్, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

16న మండల సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

ఈ నెల 16 న నంగునూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. నంగునూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమయానికి హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరయ్యే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లాలోని టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న ఔ ట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి రెండవ రోజు నిరసన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్దీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రాజకీయ పార్టీల అగ్రకుల ఆధిపత్యం రూపుమాపాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

వివిధ పార్టీలలో అగ్రకుల నాయకుల ఆధిపత్యం రూపుమాపాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు పార్టీలు బీసీ ఎస్సీ ఎస్టీలకు నాయకత్వం ఇచ్చే సామాజిక న్యాయం వైపు ఉండాలన్నారు.బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప రాజకీయంగా ఎదగనివ్వడం లేదన్నారు. అగ్రకుల పార్టీలలో నాయకత్వం ఇవ్వకుండా బానిసలుగా మారుస్తున్న వైఖరికి నిరసనగా ధర్నా కార్యక్రమం చేపట్టమన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ళ నరేష్,, యెళ్లన్నభిక్షు, సతీష్, అంజిబాబు, భూపతికృష్ణ, రాజేందర్, శ్యామ్ లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-మిరు దొడ్డి

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని భూంపల్లి ఎస్సై భువనేశ్వర్ అన్నారు. అక్బర్ పేట-భూంపల్లి మండలం చౌదర్ పల్లి గ్రామంలో పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలపై కళాజాత ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కల్పించారు. ఎవరు కూడా మూఢనమ్మకాలను విశ్వసించవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలను విక్రయిస్తే కఠినంగా శిక్షించడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

68 మందికి ఉచిత డ్రైవింగ్ లైసెన్సుల అందజేత



నవతెలంగాణ-నంగునూరు

మంత్రి హరీష్ రావు చొరవతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామనికి 68 మందికి ఉచిత డ్రైవింగ్ లైసెన్సు అందించామని గ్రామ సర్పంచ్ ఏల లతా కృష్ణ తెలిపారు.మంగళవారం మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉచిత డ్రైవింగ్ లైసెన్సు భాగంగా తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన 68 మంది మహిళలు,యువకులకు తొలివిడతలో లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కలకుంట్ల నర్సింలు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు జంగిటి సంజీవ్, బీఆర్ఎస్వీ గ్రామ అధ్యక్షుడు మల్యాల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు మల్యాల నరేష్, నాయకులు చల్లారం మహేందర్ రెడ్డి, తాటోజి భానుచందర్,పుట్ట నర్సింలు, పుట్ట శ్రీదాస్,తాటోజి అంజయ్య పాల్గొన్నారు.

సమానత్వం సాధించేందుకు ఉద్యమించాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

నవతెలంగాణ-దౌల్తాబాద్

కుల వ్యవస్థను నిర్మూలించి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశించిన సమానత్వాన్ని సాధించేందుకు ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్న గారి శంకర్ పిలుపునిచ్చారు. సామాజిక పరివర్తన పాదయాత్ర మూడవరోజు మండల పరిధిలోని గొడుగుపల్లి, కొనాయపల్లి,గోవిందాపూర్ మీదుగా మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని బోనాల పాఠశాల లో రాజ్యాంగ పీఠికపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దౌల్తాబాద్ శివాజీ చౌరస్తాలో శంకర్ మాట్లాడుతూ సనాతన ధర్మం ముసుగులో అంటరానితనాన్ని పాటిస్తూ తోటి మనిషిని మనిషిగా గుర్తించ నిరాకరించడమే సనాతన ధర్మామా అని ప్రశ్నించారు. మణిపూర్ గిరిజన స్త్రీలపై సమూహిక అత్యాచారాలకు పాల్పడుతూ నగ్నంగా ఉరేగించాలని ఏ ధర్మం చెప్పిందని ప్రశ్నించారు. ఈ మరణకాండను ఆపడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. కుల మత విద్వేషాల నుండి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. భారత రాజ్యాంగంలో



ఇండియా అంటే భారత్ అని రాసుకున్నప్పటికి ఇండియా పేరును తొలగింపు వెనుక ఉన్న కుట్రను ఎండగట్టాలన్నారు. ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాలలో దూసుకపోతుంటే భారతదేశాన్ని మూఢనమ్మకాల వైపు తీసుకెళ్లుతున్నారని దుయ్యబట్టారు. బేగంపేట, వడ్డెపల్లి, రామరాం, మందాపూర్, గొడుగుపల్లి గ్రామాలలో కుల వివక్ష పాటిస్తూ దళితులను దేవాలయాల్లోకి రానివ్వకుండా అంటరానితనాన్ని కొనసాగించడం సిగ్గు చేటన్నారు. పాదయాత్ర లో డాక్టర్ కుమార్,సురేందర్ సింగ్ డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, డిబిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్,డిబిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రదాన కార్యదర్శి బ్యాగరి వేణు,బందాఎం స్వామి,యంఆర్ పిఎస్ నాయకులు గువ్వలేగి సాయిలు, పాల్గొన్నారు.

నాణ్యమైన తునికి ఆకు సరఫరా చేయాలి

నవతెలంగాణ-మిరు దొడ్డి

బీడీ కార్మికులకు నాణ్యమైన తునికి ఆకు సరఫరా చేయాలని మల్లేశం అన్నారు. మంగళవారం అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలోని దేశాయి బ్రదర్స్ లిమిటెడ్ కంపెనీలో వారు బీడీ కార్మికులతో కలిసి మాట్లాడారు. గత మూడు నెలల నుండి నాసిరకమైన తునికకు సరఫరా చేస్తూ కార్మికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇటి విషయంపై రుద్రారం సెంటర్ మేనేజర్ రాజు భాయ్ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. రుద్రారం సెంటర్ మేనేజర్ రాజు భాయ్ రుద్రారం సెంటర్ పరిధిలోని బ్రాంచ్ చేసి తుని కాకును తనిఖీ చేయగా. అయినప్పటికీ నాణ్యమైన తురికాకు సరఫరా చేయకపోవడం చేయడం జరిగిందన్నారు. ఆరోజు కార్మికులకు మరియు హెచ్ ఎం ఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం నాయకులు మరియు సెంటర్ మేనేజర్ టేకేదారులు అందరు కలిసి చేస్తే కార్మికులకు నాణ్యమైన ఆకు వేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపిన నేటికీ కార్మికులకు ఇవ్వకపోవడం సరికాదని మండిపడ్డారు. కానీ బీడీ కార్మికులు మంచి తునికాకు వచ్చిన తర్వాతనే బీడీలు చేస్తామని అప్పటి వరకు బీడీలు చేయమని కార్మికులు యజమాలపై మండిపడ్డారు .అదే విధంగా ఆఫీసు బందు ఉన్న సరే అని తెలుపడం జరగదని అన్నారు గత శనివారం రోజు నుండి ఇప్పటివరకు కూడా ఇప్పటివరకు కూడా



సెంటర్ మేనేజర్ ఆకు తెప్పియడం లేదు దీనివల్ల రుద్రారం సెంటర్ పరిధిలో దాదాపు 2000 మంది బీడీ కార్మికులు పని లేకుండా ఉన్నారని తెలిపారు ఇప్పటికైనా సంబంధిత లేబర్ కార్మిక శాఖ అధికారులు ఈ యొక్క దేశం కంపెనీ పై చర్యలు తీసుకొని ఈ యొక్క కార్మికులకు పని కల్పించాల్సిందిగా కోరారు. లేని యెడల లేబర్ కమిషనర్ గారికి కూడా ఈ యొక్క విషయంపై చర్య తీసుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు జి మధు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మరియు రుద్రారం సెంటర్ ఏకదారులు కొంపల్లి సత్యనారాయణ సందిరి శ్రీనివాస్ రెడ్డి కన్నా శ్రీశైలం దైవ దినం నరేష్ నర్సింలు భాష్మియా ప్రకాష్ రాజయ్య రాజమౌళి నర్సింలు గణేష్ లక్ష్మీ నరసయ్య మరియు రుద్రారం గ్రామం బీడీ కార్మికులందరూ పాల్గొనడం జరిగింది.

వైద్యులు రాములుకు విశిష్ట వైద్య శిరోమణి పురస్కారం



నవతెలంగాణ-బెజ్జంకి

'జాతీయ విశిష్ట వైద్య శిరోమణి'పురస్కారాన్ని మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు వెగ్గలం జానకి రాములు మంగళవారం విజయవాడలో అందుకున్నారు. గత 42 ఎండ్లుగా వైద్య వృత్తిలో ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్నందుకు వైద్యులు జానకి రాములుకు జాతీయ పురస్కారం వరించినట్టు విశ్వకర్మ సేవా ట్రస్ట్ కమిటీ సభ్యులు మాచవరం గౌరీ శంకరాచార్యులు,బాల బ్రహ్మ చారి తెలిపారు.మండల ఆర్ఎంపీల సంక్షేమ సంఘం సభ్యులు,పరువురు గ్రామస్తులు వైద్యులు జానకి రాములుకు శుభాకాంక్షలు తెలిపారు.

హుస్నాబాద్‌కు నేడు ట్రబుల్ షూటర్

- అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి హరీశ్‌రావు
- గులాబీ శ్రేణులకు దిశా నిర్దేశం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం ప్రారంభించేందుకు ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు హాజరుకానున్నారు. మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి లక్ష్మీకాంతరావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ హుస్నాబాద్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలోని శుభం గార్డెన్ లో జరిగే ఎన్నికల సన్నాహక సమావేశంలో గులాబి శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గులాబీ పార్టీ సభ ఏర్పాటు చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ఎన్నికల సన్నాహక సభగా దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణం నుండి వేలాది మంది కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. సీఎం కేసీఆర్ గత నెలలోనే



హుస్నాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పేరును ప్రకటించారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఎల్కతుర్తి మండలం జగన్నాథపురం గ్రామంలో తన ఎన్నికల ప్రచారానికి కూడా శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ నలుమూలల నుండి వేలాదిమంది కార్యకర్తలు తరలిరాగా ఉత్సాహంగా ఎమ్మెల్యే సతీష్ ఎన్నికల శంఖారావం పూరించారు. ఇంకా కాంగ్రెస్, బిజెపి పార్టీల అభ్యర్థులు ఖరారు కాకముందే ఎమ్మెల్యే బి అర్ ఎస్ అభ్యర్థి వి సతీష్ కుమార్ ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు.

నాయకులకు అందలం.. ప్రజలకు శఠగోపం

- ప్రజాప్రతినిధులపై బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్ అగ్రహం
- బెజ్జంకి క్రాసింగ్ గ్రామ శివారులో గుంతల రోడ్డు పరిశీలన
- రాబోయే ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతులవ్వాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు బెజ్జంకి క్రాసింగ్ గ్రామ శివారులో గుంతలమయమై అధ్వానంగా మారిందని..స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులకు అందలమెక్కిస్తూ.. ప్రజలకు శఠగోపం పెడుతున్నారని బీఎస్పీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దొల్ల శ్రీనివాస్ అగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామ శివారులో గుంతలమైయమైన బెజ్జంకి ప్రధాన రోడ్డును బీఎస్పీ నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా బెజ్జంకి ప్రధాన రోడ్డు గుంతలుగా మారి ప్రమాదకరంగా మారిందని.. నిత్యం మా నియోజకవర్గ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న చూసిచూడనట్టు వ్యవహరించడంలో అంతర్యమేమిటో తెలియదని అసహనం వ్యక్తం చేశారు.మంత్రులు మండల పర్యటన వస్తేనే ప్రజాప్రతినిధులు రోడ్లపై ఏర్పడిన గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేసి మెప్పుపొందుతున్నారని.. తమ నాయకులకు ఇస్తున్న ప్రాధాన్యతలో.. ఓట్లేసి ఎన్నుకున్న ప్రజలకు కాస్తయైన ఇవ్వకుండా విస్మరిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు.స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలం వెళ్లదీస్తున్నారని ఇప్పటికైన రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ విలువైన ఓటు హక్కు వినియోగించుకునే తీరులో చైతన్యవంతులవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మండల స్థాయి క్రీడలు విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-దౌల్తాబాద్

పాఠశాల ఆటల పోటీల విభాగంలో మండల స్థాయి క్రీడా పోటీలను మహాత్మా జ్యోతిరావు పూలే సాంఘిక సంక్షేమ వెనుకబడిన గురుకుల పాఠశాలలో ఈ నెల 18 , 19వ తేదీల్లో పోటీలను నిర్వహిస్తున్నామని ఎం జె పి డి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశమైన మాట్లాడుతూ కబడ్డీ వాలీబాల్ అండర్ 14 అండర్ 17 విభాగంలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 18 వ తేదీన, 19న బాలికలకు విద్యార్థి విద్యార్థులు ఆడేందుకు ఆట మైదానాన్ని పరిశీలించడం. జరిగిందన్నారు. విద్యార్థి విద్యార్థులు ఆడేందుకు అన్ని విధాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల క్రీడల ఉపాధ్యాయలు పాల్గొన్నారు

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని గట్లమల్యాల గ్రామంలో మంగళవారం రాష్ట్ర ఆయిల్ ఫామ్ సొసైటి ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సహకారంతో మండల పరిధిలోని వివిధ గ్రామాలలో చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉద్దేశంతో



మంత్రి హరీష్ రావు సహకారంతో వారికి గొడుగులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్,సొసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, నాయకులు కర్ణకంటి వేణుగోపాల్,రచ్చ సిద్దు, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసిన నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన ముదిరాజ్ నాయకులు బిజెపి నాయకులు బండారు మహేష్ గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ అధ్వర్యంలో మర్యాదపూర్వకంగా హుజూరాబాద్ శాసన సభ్యులు ఈటెల రాజేందర్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జలిగామ గ్రామానికి ముదిరాజ్ సంఘం నాయకులు స్వామి కుమార్, రామయ్య సత్తయ్య ఆనంద్, సుదర్శన్ యాదగిరి, పాల్గొన్నారు.

బీసీ బంధు నిరంతర ప్రక్రియ

నవతెలంగాణ- దుబ్బాక

సీఎం కేసీఆర్ సర్కార్ కులవృత్తిదారులకు అందిస్తున్న రూ.1 లక్ష బీసీ బందు నిరంతర ప్రక్రియ అని దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి) చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సాయం అందుతుందని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. మంగళవారం దుబ్బాకలో వారు మాట్లాడారు. కులవృత్తిదారులకు సీఎం కేసీఆర్ బీసీ బందు ద్వారా రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని అందిస్తూ బీసీ కుటుంబాల పురోగతి,ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాడని కొనియాడారు.బీసీ బందు ప్రక్రియ ముగిసి పోలేదని ఇది నిరంతరాయంగా అందజేసే కార్యక్రమని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. ఎమ్మెల్యే రఘునందన్ రావు వ్యాఖ్యలు బీసీలను అయోమయానికి గురిచేసేలా ఉన్నాయని విమర్శిం చారు.



కుట్రపూరితంగానే ఎమ్మెల్యే రఘునందన్ రావు బీసీలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు.ఇలాంటి చేష్టలు మానుకోవాలని ఎమ్మెల్యేకు హితవుపలికారు.

8 కిలోల కంతి తొలగింపు



నవతెలంగాణ-సిద్దిపేట

అనారోగ్యంతో బాధపడుతూ తన వద్దకు వచ్చిన రేణుకకు ఆపరేషన్ చేసి ఎనిమిది కిలోల కంతి తొలగించినట్లు శ్రీ సాయి నర్సింగ్ హెూమ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ భాస్కరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కడుపు నొప్పితో అనారోగ్యంగా ఉందని తన వద్దకు వచ్చిన రేణుకకు సుమారు మూడు గంటలు కష్టపడి కంతి తొలగించినట్లు తెలిపారు. బీదవారికి తక్కువ డబ్బులతోనే ఆపరేషన్లను చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకుంటుందని తెలిపారు.

హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఎమ్మెల్యే గా అవకాశం కల్పిస్తే ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసుకుంటానని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేను హుస్నాబాద్ నియోజకవర్గానికి సేవ చేయడం కోసం నా యొక్క ఓటు ను హుస్నాబాద్ కు మార్చుకోవడం జరిగిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రజలకు ఎమ్మెల్యే ఏమి చేశారో చెప్పాలని అన్నారు. గౌరవల్లి ప్రాజెక్టు ఆనాడు ఉన్న ఆంధ్ర పాలనలో



కాంగ్రెస్ పార్టీ 70 శాతం పని పూర్తి చేసిందని, బి అర్ ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో బొలిషెట్టి శివయ్య, కేడలింగమూర్తి, మండల అధ్యక్షులు బంక చందు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం బయ్యారం గ్రామ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సౌమ్య,శ్రీ కృష్ణ, హృదయ, వైష్ణవి నర్స్



సాత్విక మార్కెటింగ్ సుధాకర్, నాగార్జున, నవీన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ 5

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | సెప్టెంబర్ 13 2023 | www.navatelangana.com

రుణమాఫీపై రైతులకు అవగాహన



నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

రైతులకు పంట రుణమాఫీ పై సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మండల వ్యవసాయ అధికారి పరశురాం రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ముందుగా లక్ష లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తున్నారని అలాగే లక్ష పైన ఉన్నవారు రైతులకు కూడా ప్రభుత్వ సూచనలు మేరకు ప్రతి ఒక్క రైతు రుణమాఫీ చేయడం జరుగుతుందని అన్నారు. రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మీకు ఫోన్ కు మెసేజ్ వస్తుంది అత్యవసరమైతే తప్ప బ్యాంకుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సదాశివరెడ్డి, ఎంపిటిసి ఎర్ర ఎల్లం, ఏఈఓ ప్రేమ్ సాయి , రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-మిరు దొడ్డి

ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలు భరించలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం మోతే గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నీల బాలయ్య(48) గత సంవత్సరం క్రితం రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రి చికిత్స పొందాడు. వాటికి తోడు చేసిన అప్పులు తీర్చగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు . ఒకవైపు అప్పులు మరోవైపు ఆరోగ్యం కావడంతో ఇంట్లో గొడవపడి మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకొని ఉన్నట్లు స్థానికులు తెలపడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు సంఘటన చేరుకున్నారు.మృతునికి భార్య కనకవ్వతో పాటు ముగురు కుమారులు ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. బాధితుని కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ మరియు గ్రామస్తులు తెలిపారు

అధికారుల వేధింపులు మానుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

అంగన్‌వాడీ సిబ్బందిపై అధికారుల వేధింపులు మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగులగొడితే భయపడేదిలేదని, బందిపోటుల్లా తాళాలు పగులగొట్టిన ప్రభుత్వ అధికారులు జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, హెల్ప ర్స్, సెంటర్స్ బంద్ చేస్తే సహించేది లేదని అన్నారు. తమ హక్కుల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్కు రూ.10 లక్షలు, హెల్పర్‌కు రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. చివరి జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడిలపై అధికారు లు అనేక రకాల వేధింపులు ఆపాలన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతూ మన పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. 2018 అక్టోబర్లో కేంద్రం పెంచిన వేతనాన్ని టీచర్లకు రూ.1500, హెల్పర్ లకు రూ.750, మినీ టీచర్లకు రూ.1250 రాష్ట్రప్రభుత్వం ఏరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో , తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం పద్మ నాయకులు ఎడ్ల లక్ష్మీప్రేమలత,కళావతి,అంజమ్మ, టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.



తదితరులు పాల్గొన్నారు. టీచర్లు, హెల్పర్ లు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో అధికార పార్టీ నాయకులు కలిసి రావాలి

- జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో అధికార పార్టీ నాయకులు కలిసి రావాలని జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి కోరారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసీ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 2వ రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా ఆగంరెడ్డి మాట్లాడుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని ఏండ్లుగా ఆందోళన కార్యక్రమాలు చేతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. ఈ ప్రాంతం మీద సవతి తల్లి ప్రేమ చూపుతూ డివిజన్ అంశాన్ని పట్టించుకోక పోవడం ప్రభుత్వ అసమర్థత పాలనకునిదర్శనమన్నారు.చేర్యాల ప్రాంతం పూర్తిగా అస్తిత్వాన్ని కోల్పోయి ముక్కలు చెక్కలుగా విడిపోయి తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ప్రాంతీయతరుడు కాబట్టే ఈ అంశాన్ని నీరుగారుస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరిక ఆకాంక్షను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించేలా చేయాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఈ ప్రాంత ద్రోహులుగా మిగిలిపోతరని అన్నారు. దీక్షలకు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కోతి యాకుబ్, క్రిస్టియన్ పాస్టర్ల సంఘం నాయకులు ఎర్రగుంట్ల ప్రభాకర్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ నాయకులు అందె అశోక్, గద్దల మహేందర్, అవుశెర్ల యాదయ్య, బిజ్జ రాము, తడక లింగం, కురారం బాల నర్సయ్య, బండి సుదర్శన్, మిట్టపల్లి నారాయణ రెడ్డి, పుట్ట రాజు, తాడెం వెంకట స్వామి, బండ్ల లక్ష్మయ్య, పోతుగంటి ప్రసాద్, అల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని 29 ఏళ్లుగా మాటలు చెబుతూ ఆచరణలో మోసం చేసిన బిజెపి మాదిగలకు చిరకాల ద్రోహిగా మిగిలిపోతుందని, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఈనెల 18 నుండి 22 వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రోజున సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట రెండవ రోజు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి మల్లిగారి యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముంద్రాతి కృష్ణ మాదిగ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతాయి, ఆచరణ మాత్రం అడుగు కూడా ముందుకు పడదన్నారు. సాక్షాత్తు ప్రధానమంత్రి వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటికి నెరవేర్చకపోవడం మాదిగలకు ద్రోహం చేయడమే అవుతుందన్నారు. వర్గీకరణ చేయకపోతే దక్షిణ భారతదేశంలో ఉన్న కోట్లాదిమంది మాదిగ ప్రజలు బిజెపి శాశ్వతంగా దూరమవుతారన్నారు. తెలంగాణలో ఉన్న నాలుగు ఎంపీ పదవులు కూడా కోల్పోతారని అన్నారు. వర్గీకరణ సాధన కోసం ఉద్యమం ఆగదని అన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు తీసుకొచ్చి ఇచ్చిన మాటను బిజెపి నిలబెట్టుకోవాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎఫ్ జిల్లా ఇన్చార్జి సామ్రాట్ ప్రకాష్ రాజు ఎమ్మెస్ ఎఫ్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పెరిక పరశురాములు మాదిగ జిల్లా నాయకులు శ్రీహరి సింధు కొలిమి మల్లేశం మాదిగ స్వామి మాదిగ పాల్గొన్నారు.

బీసీబంధుపై విమర్శలు సిగ్గుచేటు

నవతెలంగాణ-తొగుట



రాజకీయాలకు అతీతంగా బీసీ బందు అమలు చేస్తుంటే ప్రభుత్వం పై ప్రతిపక్ష నాయకులు విమ ర్శలు చేయడం సిగ్గుచేటని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కుంభాల శ్రీనివాసులు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రం తొగుటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మాట్లాడుతూ కొన్ని కుల వృత్తులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచ్చ డానికి ప్రభుత్వం బీసీ బంధు పథకం అమలు చేస్తుందన్నారు.దేశ జనాబాలో సగం ఉన్న బీసీల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం మరిచిందని, దీనిపై నోరు మెదుపని బీజేపీ నాయకులు బీసీ బంధుపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. ఎంపీ ఎన్నికల్లో 3 లక్షల పై చిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలైన రఘునందన్రావు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మీద విమర్శలు చేసే స్థాయి లేదన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీ పీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎండి. కలీమోద్దీన్, సర్పంచ్, ఎంపీటీసీలు సిరినేని గోవర్దన్ రెడ్డి, తొయేటి ఎల్లయ్య, గంగనిగల్ల మల్లయ్య,బొడ్డు నర్సింహులు, సూతరి లలిత రమేష్, వెల్పుల స్వామి, కొమ్ము శరత్, మార్కెట్ కమిటీ, సొసైటీ వైస్ చైర్మన్లు కంది రాంరెడ్డి,కుర్మ యాదగిరి, నాయ కులు కుంభాల శ్రీనివాస్, చిలువేరి మల్లారెడ్డి, బక్క కనకయ్య, శ్రీనివాస్, కుంభం రఘోత్తంరెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, మెట్టు స్వామి, మంగ నర్సింహులు, కోల కనకయ్య, పాత్కుల వెంకటేషం, రమేష్ గౌడ్, మెట్టు స్వామి, పోచయ్య, మాదాసు అరుణ్ కుమార్, రాజశేఖర్, రమేష్, రాజిరెడ్డి, బైరాగౌడ్, మల్లేశం, అనిల్, బండారు స్వామిగౌడ్, ప్రశాంత్, స్వామి, రాంబాబు, ఆజాం తదితరులు పాల్గొన్నారు.

విజేత డిగ్రీ కళాశాలలో వాక్ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్‌లోని విజేత డిగ్రీ కళాశాలలో వాక్ -ఇన్- ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. ఈనెల 14న గురువారం మరోసారి నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. టైమ్స్ ప్రో వారి సహకారంతో శాశ్వత ప్రాతిపదికన వివిధ బ్యాంకుల వారు విజేత డిగ్రీ కళాశాల లో గతంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో ఇప్పటివరకు 15 మంది ఎంపిక కాగా, వారందరికీ ఆఫర్ లెటర్ అందినట్లు ఆయన తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి విజేత డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు జరుగుతాయన్నారు. శాశ్వత ప్రాతిపాదికన వివిధ బ్యాంకులలో నెలకు 20,000 పైన జీతభత్యాలు అందుకొనే సువర్ణ అవకాశం. ఏదైనా డిగ్రీ/ బిటెక్ లో 50% మార్కులు కలిగివుండి 1996-2003 మధ్య జన్మించి, 28 సంవత్సరాలు లోపు వయసు ఉన్నవారు అర్హులు. అన్నారు. వివరాలకు 8106764653 లను సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సువర్ణ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. ఇంటర్వ్యూ హజరు అవుతున్న వారు విద్య అర్హతలు తెలియజేసేలా బయోడెటా తయారుచేసుకొని రాగలరని వారు పేర్కొన్నారు.

పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడం మన బాధ్యత

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



పర్యావరణాన్ని పరిరక్షించడంలో మహిళలు కూడా కీలక పాత్ర పోషించాలని పర్యావరణవేత్త డాక్టర్ శాంతి అన్నారు. ఋతుప్రేమ అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిద్దిపేట అర్బన్ మం డలం ఏన్సాన్పల్లి, మందపల్లి ,బూరుగుపల్లి గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు నెలసరి సమయంలో వాడే రసాయనాల క్లాత్ ప్యాడ్స్ తో ఆరోగ్యం పాడు అవడంతో పాటు పర్యావరణం కూడా కలుషితం అవుతుందని ఆమె తెలిపారు. మెన్స్ వల్ కప్ వాడటం వలన మహిళలు ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ఋతు ప్రేమ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఉన్న అపోహలను తొలగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ లు రవీందర్ గౌడ్, కమలాకర్ రావు, రాజయ్య, ఎంపీటీసీ నాగుల స్రవంతి ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

మోడీ నేతృత్వంలోనే దేశం అభివృద్ధి

- పుల్లూరులో మట్టి సేకరణ
- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్



ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోనే దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతూ సుపరిపాలనను అందిస్తున్నారని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మంగళవారం నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు గ్రామంలో జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ మట్టి సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించేందుకు పార్టీ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. జాతీయ భవంతోనే మట్టిని సేకరిస్తున్నామని అన్నారు.భారతదేశ ప్రజలు బలంగా ఉంటే దేశం కూడా బలంగా ఉంటుందన్న సద్భావనతో బిజెపి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మన మట్టిని, మనం తల్లితో పోల్చుకుంటాం అలాగే దేశాన్ని కూడా తల్లితో పోల్చుకుని భరతమాతగా పూజించుకుంటున్నాం అని అన్నారు.ప్రధాని మోడీ నేతృత్వంలో భారతదేశం బలమైన దేశంగా మారిందని ఇది దేశానికి గర్వకారణం అన్నారు.ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారతదేశం పెద్దన్న పాత్ర పోషించే స్థాయికి ఎదిగిందని రష్యా ఉక్రెయిన్ యుద్ధ సమయంలో పాకిస్తాన్ దేశీయులు బార్డర్ దాటాలంటే భారతీయ జెండాలు పట్టుకుని దాటారంటే ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠ ఏంటో అర్థం అవుతుందని అన్నారు.ప్రపంచం శాంతియుతంగా ఉండాలంటే, మోడీనే ప్రధాని కావాలని పాక్ ఆక్రమిత కాశ్మీర్లో కూడా ర్యాలీలు నిర్వహిస్తున్నారు అంటే, మోడీ ప్రతిష్ఠ అంటే ఏమిటో గుర్తించాలన్నారు.కరోనా సమయం నుంచి ఇప్పటివరకు ప్రజలకు ఉచితంగా రేషన్ అందిస్తున్న ఘనత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు.రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులకు 90 శాతం నిధులను కేంద్రమే ఇస్తుందని చెప్పారు. కేంద్రం పథకాలకు తెలంగాణ ప్రభుత్వం తమ పేర్లు పెట్టుకుని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎంతగానో కృషి చేస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్ గౌడ్, మోహన్ రెడ్డి, వంగ రామచంద్రారెడ్డి, ఉపేందర్ రావు, తోడుపునూరి వెంకటేశం , శ్రీనివాస్, ఉడుత శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, యోగి, భూపాల్ రెడ్డి, కృష్ణ, శ్రీకాంత్, అరుణ, పద్మ, సుగుణ, లతారెడ్డి, మరియు మహిళలు గ్రామస్థులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-మర్కుక్



ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని మర్కుక్ ఎస్ఐ శంకర్ అన్నారు. మంగళవారం నవతెలంగాణతో మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు ఉన్నవారు డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్నవారికి ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. కారణము లేని మరణం ఒక రోడ్డు ప్రమాదం మాత్రమేనని, వాహనదారులు తప్పకుండా రోడ్డు , ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ఇరువైపులా ఏర్పాటుచేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీ గా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని ,అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలిపారు. నిద్రలేమి తనము ఓవర్ స్పీడ్, అజాగ్రత్తగా, వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

నవతెలంగాణ-ములుగు



మండల పరిధిలో ములుగు గ్రామంలోని గీతాంజలి స్కూల్లో షీ టీం ఇన్చార్జ్ ఏఎస్ఐ శ్రీరాములు ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను సమాజంలో జరుగుతున్న అక్రమాల గురించి రూరల్ సీఐ జానకిరామ్ రెడ్డి తో కలిసి ఎస్సై విజయ్ కుమార్ షీ టీం సిబ్బంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం బాలికల మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు బాల్య వివాహాలు దాని యొక్క పరిణామాల గురించి, ఇవి టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాల గురించి, సోషల్ మీడియా దాని యొక్క పరిణామాల గురించి సైబర్ క్రైమ్స్, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజ రుక్మతల గురించి సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్ సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు లాభాల గురించి. మహిళలు గృహహింసకు వరకట్నం గురించి శారీరకంగా మానసికంగా హింసించే తదితర అంశాల గురించి స్నేహిత మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. అపరిచిత వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలని అంశాల గురించి. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100,, సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్



ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ ప్రాథమిక పాఠశాలకు జెడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ చేతుల మీదుగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎర్త్ ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకోని ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషదాయకం అని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, సర్పంచ్ దుర్గం పర్శరాములు, ఏ ఎం సి చైర్మన్ రవీందర్ రెడ్డి, పిఎసియస్ చైర్మన్ కానుకరాజు, మండల రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ బాల్ రెడ్డి, ఉప సర్పంచ్ కనకాంబరం , ఎర్త్ ఫౌండేషన్ ఎక్సక్యూటివ్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు , డైరెక్టర్ వెన్నెల, కోఆర్డినేటర్ ఆంజనేయులు ,ఎస్ఎంసి చైర్మన్ రజిత, ప్రధానోపాధ్యాయులు ఎండీ అన్వర్, ఉపాధ్యాయులు ఉమాదేవి, రాజేశ్వరి, శ్రీనివాస్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

టీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శికి శుభాకాంక్షలు

నవతెలంగాణ-తొగుట



సిద్దిపేట జిల్లా టియుడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శికి మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.మంగళవారం మండలంలోని ఎల్.బంజే రు పల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు అల్వాల కృష్ణాగౌడ్ ను ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా సహాయ కార్యదర్శి కిస్టా గౌడ్,అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా చెరుకు నరేష్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తొగుట సర్పంచ్ పి.కొండల్ రెడ్డి,ఎంపి టిసి వేల్పుల స్వామి,కోఆప్షన్ సభ్యుడు కలిమోద్దీన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి,జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

తీర్మాన పత్రాన్ని అందించిన సర్పంచ్

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం కేశ్ నాయక్ తండా గ్రామ సర్పంచ్ బానోతు రవీందర్ మంగళవారం హుస్నాబాద్ పంచాయతీరాజ్ కార్యాలయంలో డిఈ సదాశివ, ఏఈ స్నేహలకు నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మించడానికి ఏకగ్రీవ తీర్మానాన్ని వార్డ్ మెంబర్లతో కలిసి అందించారు. ఈ సందర్భంగా డిఈ సదాశివ మాట్లాడుతూ సేకరించిన స్థలంలో అతి త్వరలో భూమి పూజ నిర్వహించి నిర్మాణం పనులు మొదలు పెట్టాలని సర్పంచ్‌ను కోరారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం చిట్యాల గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయం తో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు కు మంగళవారం సర్పంచ్ ఎర్రవెల్లి రామ్మోహన్ రావు శంకుస్థాపన చేశారు. రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గత 60 ఏండ్ల నుంచి తమ కాలనీ ని ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రతి వర్ష కాలంలో చిన్న కుంట లాగా మారేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంజాల లత,ఎంపీటీసీ మిట్టపల్లి సులోచన,పీఏసీఎస్ మాజీ చైర్మన్ బొడిగం మహిపాల్ రెడ్డి, వార్డు సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

విశ్రాంతి ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ పట్టణానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు యూసుఫ్ ఖాన్‌ను ప్రముఖ రాజకీయ విశ్లేషకులు బండారు రామ్మోహన్ రావు, ఆయన సోదరులు రాంప్రసాద్ రావు, ఫణింద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో జిల్లా పరిషత్ పాఠశాలలో చాలా రోజులుగా పనిచేశారని వారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూసుఫ్ ఖాన్ సార్ సేవలు మరువలేని అన్నారు. తన ఇంటికి వచ్చి సన్మానించినందుకు బండారు సోదరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌వైకే ఆధ్వర్యంలో 15న ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-సిద్దిపేట

నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 15 న ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని, మహాత్మా గాంధీ జీవన విధానం ఆలోచనలు అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి మూల రంజిత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల యువతీ యువకులు పోటీల్లో పాల్గొనదలచిన వారు, వయస్సు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల మధ్య ఉండవలెనని, ఈ పోటీలు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఉపన్యాసం ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు జాతీయ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయిలో 25 మంది దేశవ్యాప్తంగా పాల్గొంటారని, ఢిల్లీ పార్లమెంట్ లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు.

కిటకిటలాడిన సంజీవరాయుని కొండ

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి రేగొండ గ్రామ శివారు లోని సంజీవరాయుని కొండపై ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తిశ్రద్ధలతో గుండంలో స్నానం చేసి, ఆంజనేయ స్వామికి మొక్కులు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది శ్రావణమాసం చివరి మంగళవారం తప్పనిసరిగా సంజీవరాయుని కొండపై వచ్చి దర్శనం చేసుకుంటామని అన్నారు. పురాతనమైనటువంటి ఈ దేవాలయాన్ని ప్రభుత్వం గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ముగిసిన ఐసెట్ ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ-నంగునూరు



ఎంబీఏ,ఎంసిఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్లో అర్హత సాధించి స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన మూగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం 300 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సారంగ పాణి, నితిన్ పవర్, రాజు,శ్రీనివాస్, వైదోయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవాలయం నిర్మాణానికి విరాళం



నవతెలంగాణ-ములుగు

గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మాణం కోసం మంగళవారం ములుగు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర యూత్ వింగ్ నాయకుడు ఏ టూ జెడ్ ఫౌండేషన్ చైర్మన్ జుబేర్ పాషాను జాలిగామ గ్రామస్తులు సంప్రదించారు. వెంటనే పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మాణం కోసం తనవంతుగా రూ.21 వేల విరాళం అందజేశారు ఈ సందర్భంగా అడగగానే గుడి నిర్మాణానికి విరాళం అందజేసిన జుబేర్ పాషా కు జాలిగామ గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

మండలంలో ఎస్జిఎఫ్ ఆటల పోటీలు

నవతెలంగాణ-తొగుట

మండలం స్థాయి ఎస్జిఎఫ్ ఆటల పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ యాదవ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతొ ఈ నెల 15,16 (స్కూల్ గేమ్స్ పెడరేషన్) టోర్నమెంట్ కబడ్డీ,ఖోఖో,వాలీ బాల్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు.ఈ పోటీ లలో బాలురు,బాలికలు ఈనెల 15,16 తేదిలలో పోటీలలో పాల్గొని విజయం సాధించి బహుమతు లు అందుకోవాలని సూచించారు.15 తేదీన కబడ్డీ, ఖో ఖో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొగుటలో, 16న వాలీబాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడికందులలో నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్ఐ రఘుపతికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల్ పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చిన ఎస్ఐ రఘుపతిని వడ్డేపల్లి బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేసి అభినందనలు తెలిపడం జరిగిందని సర్పంచ్ బచ్చు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం రాయపల్ మండల కేంద్రం పోలీస్ స్టేషన్ లో ఎస్సై రఘుపతిని కలిసి శుభాకాంక్షలు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలంలో శాంతిభద్రతలు కాపాడటంలో నేరాలు నియంత్రణకు చేయాలని, జిల్లాలో రాయపోల్ మండలాన్ని ఆదర్శంగా నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో బండ్ల స్వామి, సోషల్ మీడియా అయ్యగల్ల రవి, పరశరాములు, స్వామి, రమేష్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండోబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దామోదర్



నవతెలంగాణ-బెజ్జంకి

మానకొండూర్ నియోజకవర్గంలోని బెజ్జంకి,ఇల్లంతకుంట, గన్నేరువరం మండలాల రెండవ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్ మంగళవారం నియామకమైయ్యారు.ఈ మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో ఒగ్గు దామోదర్ కు నియోజకవర్గ ఇంచార్జీ సత్యనారాయణ నియామక ఉత్తర్వులు అందజేశారు.మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి పాల్గొన్నారు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లి మండలం వారికి చెందిన కుక్కల పెద్దలు వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు విషయం తెలుసుకున్న ఎంపీటీసీల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ గజ్వేల్ మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మధు కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం దేవి రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో రాయవరం గ్రామ సర్పంచ్ కుక్కల పావాని కనకరాజు, గ్రామ ఉపసర్పంచ్ గుర్రం మహేందర్, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీశైలం, కొడకండ్ల ఎంపిటిసి అశోక్, గ్రామ మాజీ సర్పంచ్ ఎక్కలదేవి చంద్రం, వార్డు సభ్యులు లత నర్సింలు, కుక్కల నవీన్, బిఆర్ఎస్ నాయకులు గంపల రాజు, రాగం నాగరాజు,కుక్కల రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుడికుటుంబానికి బీఎస్పీ నాయకుల పరామర్శ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి చెందిన లింగాల మల్లయ్య ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం బీఎస్పీ కరీంనగర్ జిల్లాధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీనివాస్ తో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుని చిత్రపటానికి బీఎస్పీ నాయకులు పూలమాలు వేసి నివాలర్పించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్,జిల్లా అర్గనైసింగ్ సెక్రెటరీ ఉల్లెందుల మహేష్,జిల్లా కోశాధికారి కాంపెల్లి రాజు,రేగులపల్లి సెక్టార్ అధ్యక్షుడు నిషాని సురేశ్ పాల్గొన్నారు

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కర్ర శ్రీహరి



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రానికి చెందిన బిజెపీ జిల్లా నాయకుడు నరాల శ్రీకాంత్ తండ్రి నరాల రాజేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయనవెంట పార్టీ యూత్ మండల అధ్యక్షుడు జాలిగాం శంకర్, ఉపసర్పంచ్ యాద అశోక్, మాజీ వార్డు సభ్యులు బస్వరాజు రాజేష్, గ్రామశాఖ యూత్ అధ్యక్షుడు పెసరు సుధాకర్, జాలిగాం రాజు, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ కొండపాక

కుకునూర్ పల్లి మండలం ముద్దాపూర్ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను టిఆర్ఎస్ నాయకులు తూమ్ శ్రీకాంతరెడ్డి మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన కొంతం లక్ష్మి మల్లయ్య కు 35,500, నర్సింగరావు కు మంజూరైన 60 వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అది రాములు, రాంరెడ్డి, కిరణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ -దుబ్బాక

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఐ సి డి ఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ ఉద్యోగులు గత రెండు రోజులుగా చేస్తున్న సమ్మెకు ఎమ్మెల్యే రఘునందన్ రావు సంఘీభావం తెలిపారు.న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలుపుతున్న అంగన్వాడి ఉద్యోగులను వేధించడం సరికాదని, వారి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బిజెపి నాయకులు అంబటి బాలేష్ గౌడ్,కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి, మచ్చ శ్రీనివాస్, పుట్ట వంశీ, సుంకోజి ప్రవీణ్ కుమార్, పలువురున్నారు.

ఆర్టీసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కోహెడ

ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఆర్టీసీ ఇస్తున్న పలు రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ డిపో మేనెజర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో సర్పంచ్ పద్మ ఆధ్వర్యంలో విలేజ్ బస్సు కార్యక్రమంలో భాగంగా ఎండీ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిపో మేనెజర్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రవేశపెట్టిన పలు రాయితీలను గూర్చి వివరించారు. విద్యార్థుల బస్‌పాస్‌లు, వికలాంగుల బస్‌పాస్‌లు, శబరిమల యాత్ర, తిరుపతి యాత్రలకు ప్రత్యేక రాయితీలను ఆర్టీసీ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీ సామిల్, విలేజ్ బస్సు అధికారి ఉల్లి చంద్రమౌళిగౌడ్, బి.మహేందర్, గ్రామస్థులు, తదితరులు పాల్గోన్నారు.

గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ కొండపాక : కొండపాకలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు 10 లక్షలు నిధులు మంజూరు చేశాడని రాష్ట్ర గౌడ సంఘం కో కన్వీనర్ అంబటి బాలచందర్ గౌడ్ తెలిపారు విధులు మంజూరు చేసినందుకు మంత్రి హరీష్ రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మిగులు మంజూరు చేయాలని కోరగానే ఉత్తర్వులు అందజేశారని తెలిపారు రాష్ట్రంలో అన్ని కులాలకు సంక్షేమ పథకాలు చేపడుతూ వారి అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సింగాటం రాములు , మారమైన రాములు, కొడకండ్ల బాలరాజ్, అంబటి కిషన్, బిక్షపతి, నర్సింలు, పర్శరాములు, కనకరాజు, హరీష్, బోలగం భాను మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

వైకుంఠధామం పనుల పరిశీలన



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 12 వ వార్డులో రూ.1 కోటి వ్యయంతో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి మంగళవారం పరిశీలించారు. వైకుంఠధామం పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని గుత్తేదారులకు సూచించారు.14 వ వార్డు కౌన్సిలర్ ఆస యాదగిరి,బిఆర్ఎస్ నాయకులు బట్టు ఎల్లం పలువురున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిన యాదయ్య(55) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మంగళవారం ఎంపీపీ తాండ పాండు గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు జుట్టు సుధాకర్, చిన్నబోయిన లక్ష్మణ్, రాజు, నరేష్ ,కుమార్, లక్ష్మణ్ తదితరులున్నారు.

హుస్నాబాద్‌లో కృత్రిమ యూరియా కొరత



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలో ఎరువుల షాపులలో. కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించి ఎక్కువ లాభాలు వచ్చే ఎరువుల ను అమ్ముతున్నారని రైతు ఐక్యత సంఘం, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు.మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాసిరకమైన బయో ఎరువులు, ఆర్గానిక్ ఎరువులు, కాంప్లెక్స్ బాక్సులు మొదలైన వాటిని రైతుల అవసరాన్ని బట్టి కావాలనే అంటగడుతున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ నుండి లింకు ఎరువుకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు లేకపోయిన ఇష్ట రాజ్యాంగం వ్యవహరిస్తున్నారన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కు 40 శాతం, అగ్రోస్ కు 20% యూరియా వస్తుంది కానీ స్టాకు తేవడం లేదన్నారు. వెంటనే వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోకపోతే రైతుల పక్షాన తీవ్ర ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కల్లూరు భూమయ్య, గడ్డం కొమురయ్య, నమిలికొండ రాజయ్య, నమిలికొండ సాంబమూర్తి, రాజయ్య, కొమురయ్య, దొంతర వేణి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ



నవతెలంగాణ-తొగుట

ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న తొగుటగ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంగల పల్లి బాలనర్సయ్యను మంగళవారం ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల మరణించిన తొగుటకు చెందిన కొమ్మెర పద్మాకర్ రెడ్డి, చందాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఇంచార్జి సర్పంచ్ జనగామ మల్లాగౌడ్ ఇటీవల మరణించ గా ఆయన కుమారులు బీఆర్ఎస్ నాయకులు సుభాష్,సురేందర్,రాజాగౌడ్లను ఎంపీ పరామర్శిం చారు. వెంకట్రావుపేట ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్ కు రూ.5 లక్షలు మంజూరవగా, మంజూరు పత్రాన్ని కుల సంఘం సభ్యులకు అందించారు. గుడికందుల, వెంకటావుపేట,జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ సమస్యలను నాయకులు ఎంపీ దృష్టికి తీసుకెల్లగా ఆయన విద్యుత్ ఎస్ఈ కి ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదే శించారు.సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను తుక్కాపూర్ గ్రామానికి చెందిన నర్స య్యకు, వెంకట్రావుపేటకు చెందిన ఎండీ నజీమో ద్దీన్ లబ్దిదారులకు అందించారు.ఎంపీ వెంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సిరినేని గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్లు కంది రాంరెడ్డి, కుర్మ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరమర్శించిన రాజనర్సు



నవతెలంగాణ-సిద్ది పేట

చిన్నకోడూర్ మండలం ఆనంతసాగర్ గ్రామ రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలోని క్షతగాత్రులను సిద్ది పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లతో మాట్లాడి, క్షతగాత్రులను పరామర్శించినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్ గుండ్ల యోగేందర్, బంధారం రాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-సిద్ది పేట

సేవా సంఘం ఆధ్వర్యంలో అల్యూమినియం ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వారికి హెల్త్ పైన అవేర్నెస్, స్క్రీనింగ్ చేయడం జరిగిందని ఓ ఆర్ డబ్ల్యు బాలమణి, జిఎన్ఎమ్ అనిత, శ్యామల తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీలో పని చేస్తున్న వారికి బీపీ చెక్ అప్, రక్తం పరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యపరమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.



హనుమాన్ ఆలయానికి రూ.లక్ష విరాళం

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని లక్ష్మీపతిగూడెం గ్రామంలో గల ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మంగళవారం లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నల్తూరులో ప్రత్యేక పూజలు....

మండలంలోని నల్తూరు గ్రామంలో కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ పోచమ్మ తల్లి దేవాలయాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కాట శ్రీనివాస్ గౌడ్ బృందం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డె క్రిష్ణ, ఎంపీపీ రవీందర్ గౌడ్, ఉప సర్పంచులు అశోక్,రవి,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మహేష్, మాజీ సర్పంచ్ జయప్రకాశ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌ను మంజీర జిల్లాగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని మంజీరా జిల్లాగా ఏర్పాటు చేయాలని మంజీరా జిల్లా సాధన సమితి సభ్యులు అశోక్ తోర్నాల్, మల్లయ్య, శంకర్ సార్, సంగ్రామ్ సార్, నారాయణ, భీమ్ సేన, శంకరన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణఖేడ్ అభివృద్ధి కావాలంటే ఈ ప్రాంతాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర మూడు ప్రాంతాల ప్రజలు (త్రి భాష) ఇక్కడ నివసిస్తున్నారని.. వీరికి ప్రత్యేక సంస్కృతి సాంప్రదాయాలు ఉంటాయన్నారు. వారికి అనుకూలంగా 16 మండలాలతో కూడిన జిల్లాను ఏర్పాటు చేయాలనిడిమాండ్ చేశారు.




మిషన్ భగీరథ కార్మికుల నిరసన

నవతెలంగాణ-న్యాల్‌కల్

రాఘవాపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ వద్ద రెండో రోజు మిషన్ భగీరథ కార్మికులు నిరసన చేపట్టారు. ఏడు నెలలుగా తమ వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి చేపడుతుందని కార్మికులు నిరసనకు దిగిన విషయం విధితమే. కాగా ప్రభుత్వం స్పందించకుంటే.. సమ్మెను ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

అనారోగ్యంతో మనస్తాపం చెంది.. బిల్డింగ్ పై దూకి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-బిడిఎల్‌బొల్లారం

అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి.. మనస్తాపానికి గురై బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్‌లో జరిగింది. బొల్లారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందన్ ప్రసాద్(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు.. మంగళవారం సాయంత్రం 6.35 గంటల సమయంలో తాను అద్దెకుంటున్న బిల్డింగ్ పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సాయుధ పోరాట వారోత్సవాల సభ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జలాలోద్దిన్ మాట్లాడుతూ.. నిజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేశారన్నారు. తెలంగాణలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ విమోచన దినోత్సవం పేరుతో సభలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా ఉన్న ఆర్ఎస్ఎస్ తెలంగాణ సాయుధ పోరాటానికి ఏ విధంగా ప్రతిబింబం అవుతుందన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి చేసిందన్నారు. సాయుధ పోరాటంలో బీజేపీ, బీఆర్ఎస్ పాత్రలేదన్నారు. రాష్ట్రం ఆవిర్భవిస్తే తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చి పదేండ్లు గడుస్తున్నా ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వం కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహా కార్యదర్శి రెహమాన్ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వజీర్ బెగ్, రుబీనా బేగం, సునీత, లక్ష్మి ఆనంద్, శంకరప్ప, మహబూబ్ ఖాన్, సంజీవరెడ్డి, ఖాజా, అన్వర్, అఫ్జల్ , అశ్వక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళా' కేంద్ర ప్రారంభం

నవతెలంగాణ-మునిపల్లి

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కేంద్రాన్ని స్థానిక మండల పరిషత్ అధ్యక్షురాలు శైలజ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీలు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా.. ఇప్పుడు మహిళా ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఈ మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు మీనాక్షి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సంధ్య, బీఆర్ఎస్ నాయకులు సాయికుమార్, మండలాధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



'తుక్కుగూడ' బహిరంగ సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గంలో అన్ని బూత్ స్థాయి నుండి 50 నుండి 100 మంది వరకు తుక్కుగూడ బహిరంగ సభకు హాజరుకావాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు పట్లోళ్ల సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. తుక్కుగూడ బహిరంగ సభలో తెలంగాణ ప్రజల, ఉద్యోగుల, బడుగు బలహీన వర్గాల, దళిత, గిరిజన, మైనార్టీ, రైతుల, కార్మికుల, విద్యార్థి, యువజన సమస్యలపై మేనిఫెస్టో విడుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లాగా బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్ పటేల్, కృష్ణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆశాలకు 'అంగన్వాడీ' బాధ్యతలను అప్పగించడం మానుకోవాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు


ఆశా వర్కర్లకు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను అప్పగించడం మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల ధర్నా నిర్వ హించారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్ల సమస్య ల సాధన కోసం ఈనెల 11 నుండి సమ్మె ప్రారంభం అయిందన్నారు. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యత ఆశా వర్కర్లు నిర్వహణ చేయాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు,డి ఎం ఎండ్ ఎచ్ఒ అధికారులు, మున్సిపల్ అధికారులు,ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఆశా వర్కర్ల కు వారి పనితో పాటు,బిఎల్ ఓ పనులు ఉన్నాయని అదనంగా అంగన్వాడీ పనులు మరింత పని భారం అవుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యత అపచెప్పడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో గీతా, హైమవతి, మాధవి, వనజ, లక్ష్మి,శాంతి, సరిత, రంగలక్ష్మి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని క్యాబ్ డ్రైవర్ మృతి

నవతెలంగాణ-పటాన్‌చెరు

గుర్తు తెలియని వాహనాన్ని వెనకనుంచి కారు ఢీకొన్న ఘటనలో క్యాబ్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్పూర్ నవ్య నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్(45) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల 30 నిమిషాల సమయంలో లింగంపల్లి నుంచి సంగారెడ్డి వైపు కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని ముత్తంగి చర్చి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై.. అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-గుమ్మడిదల

పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు నెలసరి వేతనాలు వెంటనే చెల్లించాలని మంగళవారం సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. గుమ్మడిదల మండలం అన్నారం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల వరకు వేతనాలు చెల్లిస్తుండటంతో.. ఎన్నో ఇబ్బందులకు గురవుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు పాలకవర్గం సభ్యుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కరించ కపోవడంతో మంగళవారం విధులకు గైర్హాజరు కావాల్సి వచ్చిందన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక చొరవ తీసుకొని.. తమకు వేతనాలు చెల్లించే విధంగా చూడాలని కోరారు.



తల్లెల్మా పీహెచ్సి ఎదుట ఆశా వర్కర్ల నిరసన

నవతెలంగాణ-జోగిపేట

అంగన్వాడీ కేంద్రాలను ఆశా వర్కర్లు స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకురావడాన్ని నిరసిస్తూ.. ఆశా వర్కర్లు మంగళవారం ఆందోల్ మండల పరిధిలోని తల్లెల్మ పిహెచ్సి ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశా వర్కర్లపై పని భారాన్ని మోపడం తగదన్నారు. తమ సమస్యలు కూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి తాము కూడా సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి యశోద, గంగ, లక్ష్మీ, స్వరూప, యాదమ్మ, విజయలక్ష్మి, మొగులమ్మ, మరియా, నీరజ, లక్ష్మీ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో 15, 16న స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ఈనెల 15న మండల కేంద్రమైన జిన్నారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.భూపాల్‌రెడ్డి, శివనగర్ జెడ్పీహెచ్ఎస్ పీఈటీ గోపాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో భాగంగా అండర్ 14, అండర్ 17 బాల బాలి కలకు, కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో ఆటలలో మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 15వ తేదీన బాలురకు, 16వ తేదీన, బాలికలకు స్థానిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిన్నారం ఆవరణలో స్కూల్ గేమ్స్ కోసం ఎంపిక కార్యక్రమాలు ఉంటా యన్నారు. సదరు తేదీల్లో విద్యార్థిని విద్యార్థులు ఉదయం 9 గంటల వరకు జెడ్పిహెచ్ఎస్ జిన్నారం ప్రాంగణంలో ఉండేలా చూడాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వారు విజ్ఞప్తి చేశారు.